ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శనివారం 10 మే 2025



ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి వైశాఖ మాస బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.. వాహనాలపై స్వామి క్షేత్రవీధుల్లో తిరుగాడుతూ భక్తులకు దర్శనమిచ్చారు.. శుక్రవారం రాత్రి చంద్రప్రభ వాహనంపై చిద్విలాసంగా ఉభయ దేవేరులతో స్వామివారు.. - లోపలి పేజీలో..

కరోనాలోనూ..
పీక్కు తిన్నారు



దొంగ బిల్లులతో అధికారుల అవినీతి.. ఆడిట్‌లో ఇలా దొరికేశారు

- భీమవరంలో అప్పటి మున్సిపల్ అధికారులు, సిబ్బందిపై చర్యలకు సిఫారసు
- క్రిమినల్ కేసు నమోదుకు ప్రభుత్వం ఆదేశం



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

2020-21 సంవత్సరాల్లో కొవిడ్ మహమ్మారి సృష్టించిన విలయం అంతా ఇంతా కాదు. కరోనా పేరు వింటేనే జనం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వణికిపోయేవారు. ఈ రోజు ఎవరి నుంచి ఎలాంటి మరణవార్త వినాల్సి వస్తుందోనని హడలిపోయేవారు. ఇలాంటి పరిస్థితుల్లో కరోనా కట్టడికి కేంద్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేసింది. కానీ కొందరు అధికారులు ఈ సొమ్మును పీక్కుతిన్నారు. ఇలాంటి వారంతా ఆడిట్‌లో దొరికిపోయి ఇప్పుడు కేసులు ఎదుర్కొంటున్నారు.

కరోనా సమయంలో జిల్లాలోని మున్సి పాలిటీల్లో క్వారంటైన్ కేంద్రాల ఏర్పాటు తో కొందరు అధికారులకు కలిసి వచ్చింది. కొవిడ్ బాధితులకు మాస్కులు, వాటర్ బాటిళ్ల, భోజన వసతులు కల్పించారు. రెడ్‌జోన్‌లలో ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేశా రు. వీటికి మున్సిపాలిటీల్లో బిల్లులు చేసుకున్నారు. జిల్లాలో తాడేపల్లిగూడెం, భీమవరం, పాలకొల్లులోని టిడ్కో ఇళ్లల్లో క్వారంటైన్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. తాడేపల్లిగూడెం కేంద్రానికి జిల్లా నలు మూలల నుంచి బాధితులను తీసుకు వచ్చి వైద్య సేవలందించారు. ఆ తర్వాత భీమవరం నిలిచింది. కొవిడ్ బాధితులకు అక్కడ ఆశ్రయం కల్పించారు. భీమవరం లో రాష్ట్ర ఫుడ్ అండ్ సేఫ్టీ శాఖ వాటర్ బాటిళ్లను సమకూర్చింది. వైద్య ఆరోగ్య శాఖ మాస్కులు సరఫరా చేసింది. కాని, ఆ రెండు మున్సిపాలిటీ ఇచ్చినట్టు బిల్లులు చేసుకున్నారు. కాంట్రాక్టర్ జీఎస్టీలో నమో దు కాలేదు. ఫేక్ బిల్లులపై సంతకాలు చేసినట్టు ఆడిట్ అధికారులు నిగ్గు తేల్చా రు. మొత్తంపైన భీమవరం మున్సిపాలి టీలో మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమా ర్ సమయంలో రూ.1.40 కోట్లు చెల్లించా రు. అందులో అవకతవకలు జరిగాయని ఆడిట్ అధికారులు గుర్తించారు. అప్పట్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి రికార్డులు పరిశీలించారు. కానీ ఏమీ చేయలేకపోయారు. చివరకు ఆడిట్ అధికారుల నివేదిక ఆధారంగా నిధులు దుర్వినియోగమైనట్లు తేల్చారు. అప్పటి మున్సిపల్ కమిషనర్ రమేష్‌కుమార్ సహా ఆరుగురిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. భీమవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ప్రస్తుత కమిషనర్ గురువారమే ఫిర్యాదుచేశారు. అది స్పష్టత లేకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదు. మరోసారి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు. అప్పట్లో మున్సిపాలిటీ నుంచి క్వారంటైన్ కేంద్రానికి బాధ్యత వహించిన సిబ్బందిపైన కేసులు నమోదు చేసేలా దిశా నిర్దేశం చేసింది. కొవిడ్ తర్వాత బాధ్యతలు చేపట్టిన మహిళా కమిషనర్ హయాంలోనూ నిధులు దుర్వినియోగం అయ్యాయని గుర్తించారు.

తాడేపల్లిగూడెంలో..

తాడేపల్లిగూడెం టిడ్కో ఇళ్లల్లో క్వారంటైన్ కేంద్రం నిర్వహించారు. రోజు వేలాది మంది బాధితులకు ఆశ్రయం కల్పించారు. వారికి ఫ్యాన్‌లు, ఇతర సదుపాయాలు కల్పించేందు కు అప్పటి వైసీపీ నేత ముఖ్య అనుచరుడికి జీఎస్టీ లైసెన్స్ లేకపోయినా కాంట్రాక్ట్ ఇచ్చి రూ.1.50 కోట్లు చెల్లించారు. రెడ్ జోన్‌ల పేరుతోనూ నిధులు వెచ్చించారు. తాడే పల్లిగూడెం మున్సిపాలి టీలోనూ కోవిడ్ పేరుతో నిధులు బొక్కేశారు. కానీ ఇక్కడ వైసీపీ నేత ఒత్తిడితో బయటకు రాకుండా సర్దుబాటు చేసుకున్నా రు. అయినా అప్పటి జిల్లా అధికారులు పెదవి విప్పలేదు.

తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టి ఏడాదికి చేరువవుతోంది. ఇప్పటి వరకు నామినేటెడ్ స్థాయిలో కొందరికే అవకాశం ఇచ్చారు. ఈ పార్టీ కోసం నిర్విరామంగా కష్టించడమే కాకుండా గడిచిన ఐదేళ్లలో జగన్ జమానాలో అక్రమ కేసులతోపాటు ప్రత్యక్ష, పరోక్ష బెదిరింపులు ఎదుర్కొన్న వారందరికీ అధికారంలోకి రాగానే నామినేటెడ్ పదవులు ఇస్తామన్నారు. కానీ ఇప్పటి వరకు కొందరికే అవకాశం ఇచ్చారు. క్షేత్రస్థాయిలో కేడర్ కోరుకుంటున్న సొసైటీల త్రిసభ్య కమిటీల్లో, దేవాలయ కమిటీల్లో, మార్కెట్ కమిటీల్లో చోటు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టారు. కార్పొరేషన్‌లో కొందరికి అవకాశం ఇచ్చి మరి కొందరిని విస్మరించారు. నామినేటెడ్ గౌరవం కోసం ఏడాదిగా ఎదురుచూస్తున్న వారంతా ఇంకా ఎప్పుడు ఇస్తారంటూ ప్రశ్నిస్తున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

నామినేటెడ్ నిరీక్షణ


కొటికలపూడి చినబాబు
గన్ని వీరాంజనేయులు

డీసీసీబీ.. డీసీఎంఎస్ ఖాయమే!

డీసీసీబీ, డీసీఎంఎస్ ఈ రెండు ఉమ్మడి జిల్లాలోనే ఉన్నాయి. ఈ రెండింటికి చైర్మన్‌తోపాటు పూర్తిస్థాయి కమిటీని నామినేట్ చేయాల్సి ఉంది. మిగతా జిల్లాల్లో ఈ ప్రక్రియ పూర్తి అయినా ఉమ్మడి పశ్చిమలో సర్దుబాటు పేరిట జాప్యం జరుగుతోంది. ఏలూరు జిల్లాకు చెందిన టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులుకు ఆప్కో చైర్మన్ ఇస్తామని సంకేతాలు పంపారు. దీనికి అనుగుణంగా ఆయన ఏలూరు డీసీసీబీ చైర్మన్‌గా నామినేటెడ్ కావాలి. ఐదారు రోజుల క్రితం మిగతా జిల్లాల కమిటీలను ప్రకటించారు. ఉభయ గోదావరి, ఉమ్మడి జిల్లాలకు ఈ జాబితాలో చోటు దక్కలేదు. డీసీసీబీ టీడీపీకి కేటాయిస్తే డీసీఎంఎస్ జనసేనకు కేటాయించాలని భావించారు. డీసీసీబీ చైర్మన్‌గా గన్ని, డీసీఎంఎస్ చైర్మన్‌గా కొటికలపూడి గోవిందరావు(చినబాబు)ల పేర్లు ఖరారయ్యాయని సమాచారం. నేడో రేపో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

కేడర్‌లో ఆగ్రహం, అసంతృప్తి

జగన్ ప్రభుత్వ హయాంలో సహకార సంఘాలను త్రిసభ్య కమిటీలతో నిర్వహిస్తూ వచ్చారు. ఇప్పట్లో సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించే అవకాశాలు లేకపోవడంతో త్రిసభ్య కమిటీ లతో సరిపెట్టాలని టీడీపీ యోచించింది. వివిధ సంఘాల్లో త్రిసభ్య కమిటీలతో జాబితాలను ఎమ్మెల్యేలు సిద్ధం చేసి పంపారు. బీజేపీ, జనసేనలకు పలు సంఘాల్లో చోటు ఇచ్చారు. గ్రామ, నియోజకవర్గ స్థాయిల్లో త్రిసభ్య కమిటీల మీదే అత్యధికులు ఆసక్తిగా ఉన్నప్పటికీ అధికార ప్రకటనలు జాప్యం కావడం కిందిస్థాయి మూడు పార్టీల కేడర్‌లో ఆగ్రహం, అసంతృప్తి కలిగిస్తోంది. ఎమ్మెల్యేలు కేడర్ నుంచి ఎదురవుతున్న ఒత్తిడిలతో నలిగిపోతున్నారు.

రాష్ట్రస్థాయి పదవుల కోసం మరికొందరు..

రాష్ట్రస్థాయి కార్పొరేషన్‌లో చాలా వరకు భర్తీ చేసినా.. చాలా వరకు పెండింగ్‌లో వున్నాయి. వీటి కోసమే ఆశావహులు ఆరాట పడుతున్నారు. ఏలూరు పట్టణాభివృద్ధి సంస్థ(ఈడా)లో నామినేటెడ్ పోస్టుల భర్తీకి జాప్యం కొనసాగుతోంది. ఉమ్మడి పశ్చిమలో మూడొంతుల మండలాలు ఈడా పరిధిలోకి వస్తాయి. వివిధ నిర్మాణా లకు ఈడానే అనుమ తులివ్వాలి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈడా చైర్మన్‌గా సీనియర్ నేత ఎంఆర్‌డీ బలరాం సతీమణి మాజీ మున్సిపల్ చైర్మన్ మధ్యాహ్నపు ఈశ్వరి, బొద్దాని శ్రీనివాస్ కొనసాగారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈడా పదవి కోసం అనేకమంది ఆశపడ్డారు. ఒకప్పుడు వైసీపీలో వున్న ఎంఆర్‌డీ బలరాం దంపతులు, బొద్దాని శ్రీనివాస్ ఇప్పుడు టీడీపీలో కొనసాగుతున్నారు. మరోసారి తమ కుటుంబానికి అవకాశం ఇవ్వాల ని బలరాం ఆశిస్తూ వచ్చారు. నామినేటెడ్ పదవి విషయంలో ఎమ్మె ల్యేల సిఫార్సులు పరిగణనలోకి తీసుకునేవారు. కానీ ఇప్పుడు నామి నేటెడ్ పదవుల్లో సామాజికవర్గాల వారీగా, నియోజకవర్గాల వారీగా ఎంపిక చేస్తూ వస్తున్నారు. ఈ కారణంగా పేర్లు సిఫార్సు వరకే ఎమ్మెల్యేలు పరిమితమయ్యారు. మిగిలిన వ్యవహారమంతా టీడీపీ అధిష్ఠానం చూసుకుంటోంది. జనసేన, బీజేపీలు కొన్ని నియోజకవ ర్గాల్లో తమ పార్టీ పక్షాన నామినేటెడ్ పదవుల్లో చోటు కల్పించాల్సిం దిగా సమన్వయ కమిటీ సమావేశాల్లో జాబితాలు ఇచ్చాయి.



ఇంకా భర్తీ కాని పదవులు

- మార్కెట్ కమిటీలకు దిక్కులేదు
- సొసైటీ త్రిసభ్య కమిటీలను తేల్చలేదు
- జిల్లా, రాష్ట్రస్థాయి కార్పొరేషన్లదీ ఇదే పరిస్థితి
- అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా నాన్చుడే
- ఇదేనా గుర్తింపు అంటూ టీడీపీ కేడర్ కస్సుబుస్సు
- జనసేన, బీజేపీలోనూ ఎదురుచూపులు

పూర్తిస్థాయిలో భర్తీ కాని మార్కెట్ కమిటీలు

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మార్కెట్ కమిటీలను పూర్తిస్థాయిలో ఇప్పటికీ భర్తీ చేయలేదు. రిజర్వేషన్లు, నియోజకవర్గ స్థాయిలో బలమైన నేతలు, కార్యకర్తలు మహిళల నుంచే ఎంపిక చేయడానికే ఎక్కువ సమయం తీసుకుంటున్నారు. ఈ కారణంగా అధికారంలోకి వచ్చినా మార్కెట్ కమిటీలను పూర్తిగా వేయలేకపోతున్నారంటూ ఎమ్మెల్యేల పై కార్యకర్తలు ఫైర్ అవుతున్నారు. మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోను మార్కెట్ కమిటీలు భర్తీ కాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పశ్చిమగోదావరిలో పది మార్కెట్ కమిటీలకు నాలుగు, ఏలూరు జిల్లాలో తొమ్మిదింటికి మూడు మార్కెట్ కమిటీలను మాత్రమే నామినేటెడ్ చేయగలిగారు. మిగతా వాటి విషయంలో రెండున్నర నెలల నుంచి కసరత్తు పేరిట సాగదీస్తున్నారు. 200లకు పైగా దేవాలయ కమిటీలను నామినేటెడ్ దిశగా జీవోతో కాస్తా కదలిక వచ్చింది. గుర్తించిన దేవాలయాల్లో స్థానిక నేతలకు అవకాశం ఇచ్చేందుకు ఇది దోహదపడుతోంది.

ఎన్నికలు పూర్తి అయిన తర్వాత జనం మెచ్చే విధంగా మిమ్మల్ని గుర్తిస్తామంటూ పార్టీ నేతలకు, కార్యకర్తలకు టీడీపీ అధినేత చంద్ర బాబు, లోకేశ్ ఇచ్చిన హామీలను గుర్తు చేసుకుంటూ మదనపడిపో తున్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి సుమారు 100 మంది వరకు ముఖ్యనేతలు, కార్యకర్తలు నామినేటెడ్ పదవులను ఆశిస్తూ పార్టీకి దరఖాస్తు చేసుకుంటున్నారు. తీరా భర్తీ విషయంలో జాప్యం కొనసా గడాన్ని తట్టుకోలేకపోతున్నారు. ప్రత్యేకించి తమకు అన్యాయం జరు గుతోందని మహిళా నేతలు దిగాలు పడ్డారు.

ఎదురుచూపు నేతలు

భీమవరం నియోజకవర్గంలో నిర్విరామంగా కష్టపడుతున్న టీడీపీ నేత కోళ్ల నాగేశ్వరరావు తనకు నామినేటెడ్

మిగతా 8వ పేజీలో...

సిమెంట్ పూతలు!



- నూజివీడులో నెల రోజులకే ధ్వంసమైన సిమెంట్ రోడ్లు
- మంత్రిగారి ఇలాకాలో.. బిల్లుల కోసం మసిపూసి మారేడుకాయ చేస్తున్న కాంట్రాక్టర్



ఈ ఫొటోలు చూసి సిమెంట్ రహదారి నిర్మిస్తున్నారనుకుంటే పొరబడినట్టే. నూజివీడు శివారు కొన్నంగుంట వద్ద నిర్మించిన నెల రోజులకే సిమెంట్ కొట్టుకుపోయి రాళ్లు పైకి తేలడంతో హడావుడిగా బిల్లులు కోసం ఇలా పైపైన సిమెంట్ పూసి ఎవరూ తొక్కకుండా రాళ్లు, కొబ్బరి బొందలు, తాటిబొందలు అడ్డుపెట్టారు. ఇది చూసిన జనం ఔరా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

సిమెంట్ రోడ్డుపై సిమెంట్‌పూత పూసి దాన్ని ఎవరూ తొక్కకుండా రాళ్లు, తాటి బొందలు, కొబ్బరి బొందలు అడ్డుగా పెట్టడంతో చూసిన ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

నూజివీడు, మే 9 (ఆంధ్రజ్యోతి) : నూజి వీడు పట్టణాన్ని మోడల్‌టౌన్‌గా తీర్చిదిద్దుతా నని ఎమ్మెల్యే, మంత్రి కె.పార్థసారథి పలు మార్లు నూజివీడు ప్రజలకు హామీ ఇచ్చారు. ఆ వాగ్దానం మేరకు నూజివీడు పట్టణంలో పెద్ద చెరువు వద్ద, నూజివీడు శివారు గ్రామ మైన కొత్తూరు - కొన్నంగుంట రహదారిలో కొన్నంగుంట వద్ద తారు రోడ్ల స్థానే సిమెంట్ రహదారుల నిర్మాణానికి అనుమతులు సాధిం చారు. ఈ రెండు సిమెంట్ రోడ్డుల నిర్మాణా లను ఒకే కాంట్రాక్టర్ టెండర్ ద్వారా పొందా డు. పట్టణంలో పెద్ద చెరువు వద్ద రూ.80 లక్షల వ్యయంతో 200 మీటర్ల మేరకు సిమెం ట్ రోడ్డు, కొన్నంగుంట వద్ద రూ.కోటి వ్యయంతో 500 మీటర్ల వరకు తారు రోడ్డు స్థానంలో సిమెంట్ రోడ్డును ఇటీవల నిర్మిం చారు. నిర్మాణం పూర్తయి సుమారు నెల రోజు లైంది. వాహనాల రాకపోకలు ప్రారంభించిన కొద్దిరోజులకే ఈ రెండుచోట్ల పైన సిమెంట్ కొట్టుకుపోయి చిప్స్ (చిన్న కంకర రాయి) తేలుతూ నిర్మాణంలో డొల్లతనానికి సాక్ష్యంగా నిలిచాయి. దీనిపై ప్రజలు విమర్శలు గుప్పి స్తుండడంతో కొన్నంగుంట వద్ద రాళ్లు తేలిన

అసలు తనిఖీలు చేశారా?

ఈ రహదారి నిర్మాణాలను పర్యవేక్షించా ల్సిన రోడ్లు, భవనాలశాఖ అధికారులు, పను లు జరిగేటప్పుడు తనిఖీలు చేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారు లు సకాలంలో నిబంధనల ప్రకారం పర్యవేక్షణ జరిపి ఉంటే ప్రజాధనం వృథా కాకుండా ఉండేది. ఇక శాఖకే చెందిన క్వాలిటీ కంట్రోల్ విభాగం ఈ రహదారుల నాణ్యతను పరిశీ లించి సంతృప్తికరమైన నివేదిక ఇస్తేనే కాంట్రాక్టర్‌కు తుదిబిల్లు చెల్లిస్తారు. ఇప్పుడు దానికోసమే ఈ కాంట్రాక్టర్ పైపైన సిమెంట్ పూసి బిల్లులు మంజూరు చేయించుకునే యత్నంలో ఉన్నట్టు సమాచారం. నిర్మించిన నెలరోజులకే నాణ్యత లోపంతో దెబ్బతిన్న ఈ రోడ్ల సమస్యను అధికారులు ఎలా పరిష్కరిస్తారో వేచి చూడాల్సిందే.


పెద్దచెరువు వద్ద నిర్మించిన సిమెంట్ రహదారిపై నెలరోజులకే సిమెంట్ కొట్టుకుపోయి కంకర తేలిన దృశ్యం

నీటిచౌర్యం!


నీటిని మోటారు పైపులతో తోడుతున్న దృశ్యం

పట్టిసీమ పైపుల బోల్టులు ఊడదీసి.. మోటార్లతో తోడేస్తున్నారు

- సాగునీటి కోసం కొందరు రైతుల అడ్డదారులు
- ఏటా పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు
- పోలీసులకు, అధికారులకు ఫిర్యాదు చేసిన నిర్వాహకులు

పోలవరం, మే 9 : పోలవరం మండలంలో పట్టిసీమ వద్ద నిర్మించిన పట్టిసీమ మేజర్ ఎత్తిపోతల పథకం నుంచి నీటి విడు దల లేకపోవడంతో కొందరు స్థానిక రైతులు సాగునీటి అవసరాల కోసం అడ్డదారుల తొక్కుతున్నారు. దీనివల్ల పట్టిసీమ మేజర్ ఎత్తిపోతల పథకం నిర్వహణ కాంట్రాక్టర్లు ఏటా పైపులైన్ల మర మ్మతులు చేపట్టాల్సి వస్తోంది.

గతంలో టీడీపీ పాలనలో పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు గోదావరి జలాలు పంపిణీ చేయడానికి పట్టిసీమ ఎత్తిపోతల పథ కం నుంచి ఇటుకలకోట డెలివరీ ఛానల్ వరకు 3.995 కిలోమీటర్ల మేర భారీ పైపులైన్లు ఏర్పాటు చేశారు. ఆ పైపులైన్లకు పలుచోట్ల ఎయిర్‌వాల్‌లను ఏర్పాటు చేశారు. అత్యవసర సందర్భాల్లో ఎయిర్ వాల్వ్ మూతలు తీసేలా భారీ ప్లాంజ్‌లు వేసి బోల్టులు బిగించారు. గత రెండేళ్లుగా మార్చి, ఏప్రిల్ నెలల్లో వరి, మొక్క జొన్న, అపరా ల పంటలకు గోదావరిలో నీటిమట్టం 14 మీటర్లకు తక్కువగా ఉండడం వల్ల పట్టిసీమ నుంచి అధికారులు నీటి సరఫరా చేయలేదు. దీంతో కొందరు రైతులు ఎయిర్‌వాల్వ్ పైపులైన్ల ప్లాంజ్ బోల్టులు ఊడదీసి ఆపైపుల నుంచి మోటార్ల ద్వారా నీటిని తోడి సాగు నీటికి ఉపయోగిస్తు న్నారు. ఈ క్రమంలో బోల్టులు బిగించకుండా వదిలివేయడం, గ్యాస్‌కట్లు తెగిపోయి లీకేజీలు కావడం వల్ల ప్లాంజ్‌లు ఊడి నీటి పంపిణీ సమయాల్లో పైపుల నుంచి ఫౌంటేన్‌లా ఎగజిమ్ముతున్నాయి. వాటికి మరమ్మతులు చేయడం ఎత్తిపోతల పథకం నిర్వాహకులకు అదనపు వ్యయంతో పాటు అదనపు శ్రమతో కూడుకున్న వ్యవహారంగా మారింది. గతేడాది జూన్ ఆరో తేదీన ఇదే విధంగా ప్లాంజ్ లీకై జలాలు వృథాగా పోయాయి.


మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది


ఎయిర్ వాల్వ్ ప్లాంజ్ విప్పి వదిలేసిన దృశ్యం..

ఈ ఏడాది 25 ప్రాంతాల్లో..

ఈ ఏడాది కూడా సాగు నీటి కోసం రైతులు 25 ప్రాంతా ల్లో ఎయిర్‌వాల్ ప్లాంజ్ బోల్టులు పీకి నీటిని తోడి వదిలివేసి నట్టు నిర్వాహకులు చెబుతున్నారు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో, జలవనరుల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు నిర్వాహక సంస్థ ప్రతినిధి రాజు తెలిపారు. ప్రస్తుతం మరమ్మ తులు చేపట్టామని, సమస్యలు తలెత్తిన ప్రాంతంలో మెషీన్లతో పనులు చేయించాల్సి ఉంటుందని, కొత్తబోల్టులు, గ్యాస్‌కట్లు వాడాల్సి ఉంటుంద న్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటే ఈ సమస్య పునరావృతం కాకుండా ఉంటుందని కోరుతున్నారు. దీనిపై పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజుని వివరణ కోరగా ఏటా రైతులు సాగు నీటి అవసరాలకు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని, రైతులను సమావేశ పరచి అవగాహన కల్పించడం, పోలీసు సహాయంతో కౌన్సెలింగ్ ఇప్పించడం ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ఏలూరు సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇప్పటివరకు రూ. 501.81 కోట్ల విలువైన 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 17,512 మంది రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసినట్టు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పీఎస్‌ఆర్ మూర్తి శుక్రవారం తెలిపారు. ఇప్పటివరకు రూ.398.52 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. ధాన్యాన్ని దళారుల ప్రమేయం లేకుండా రైతు సేవా కేంద్రాల ద్వారా రైస్‌మిల్లులకు తరలిస్తున్నారని వివరించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా 57,50,574 గోనె సంచులను సరఫరా చేశామన్నారు. రైతు సంఘాలు, రైతుల విజ్ఞప్తుల మేరకు జిల్లాకు 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించినట్టు తెలిపారు.

కేజీబీవీలకు నిధుల విడుదల

ఏలూరు అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయ (కేజీబీవీ)ల్లో పనిచేస్తున్న బోధనా సిబ్బం దికి ఏప్రిల్ వేతనాలు, క్లస్టర్ రీసోర్స్ సెంటర్లకు రూ.1.29 కోట్లు, విద్యా ర్థుల డైట్ చార్జీల నిమిత్తం రూ.8.36 లక్షలు బడ్జెట్ నిధులు విడుదల య్యాయి. ఈ మేరకు సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ కె.పంకజ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నిఘాను పటిష్ఠం చేయండి : ఎస్పీ

చింతలపూడి, మే 9 (ఆంధ్రజ్యోతి) : 'నేరాల నియంత్రణకు నిఘా వ్యవస్థ పటిష్ఠం చేయాలి. డ్రోన్ కెమెరా ద్వారా నేరాల గుర్తింపు, ట్రాఫిక్ సమస్యకు చర్యలు తీసుకోవాలి. కళాశాలలు, ప్రధాన సెంటర్లలో శక్తి యాప్ ద్వారా అవగాహన కల్పించాలి' అంటూ జిల్లా ఎస్పీ కె.ప్రతాప శివకిషోర్ సిబ్బందికి సూచిం చారు. చింతలపూడి పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన వార్షిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలు చేయాలన్నా రు. పీజీఆర్‌ఎస్‌లో అందిన సమస్యలను సత్వరం పరిష్కరిం చాలన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై ఎటువంటి అసత్య ప్రచా రాలు జరపకుండా చూడాలన్నారు. కొత్త వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. ఏరియా పరిధిలో మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజ లకు అవగాహన కల్పించాలన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రక్తదాన శిబిరాన్ని పరిశీలించారు. రక్తదానం వల్ల ఎందరికో ప్రాణదానం చేసిన వారవుతారన్నారు. డీఎస్పీ రవిచంద్ర, చింతలపూడి సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ కుటుంబరావు, సిబ్బంది పాల్గొన్నారు.


సర్కిల్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ ప్రతాప శివకిశోర్

వంటిల్లు

మనలో చాలామంది తాటి ముంజలను ఇష్టంగా తింటూ ఉంటారు. వీటితో రకరకాల వంటలు కూడా చేసుకోవచ్చు. తాటి ముంజలను సరికొత్తగా ఆస్వాదించాలనుకునేవారి కోసమే ఈ రుచులు...



తాటి ముంజలతో మురిపించే రుచులు

తాటి ముంజలతో లెమనేడ్

కావాల్సిన పదార్థాలు

తాటి ముంజలు- నాలుగు, నిమ్మరసం- రెండు చెంచాలు, పంచదార- మూడు చెంచాలు, ఐస్ క్యూబ్స్- 4, ఉప్పు- చిటికెడు, నల్ల ఉప్పు- చిటికెడు, నీళ్లలో నానబెట్టిన సబ్జాగింజలు- రెండు చెంచాలు, పుదీనా ఆకులు రెండు

జాగ్రత్తలు

- లేత తాటి ముంజలు తీసుకుంటే ఈ పానీయం మరింత రుచిగా ఉంటుంది.
- ఇందులో నానబెట్టిన చియా గింజలు కూడా వేసుకోవచ్చు.

తయారీ విధానం

- తాటి ముంజలను చిన్న ముక్కలుగా తరగాలి.
- మిక్సీలో తాటి ముంజల ముక్కల్లో సగం, నిమ్మరసం, పంచదార, రెండు ఐస్ క్యూబ్‌లు, ఉప్పు, నల్ల ఉప్పు వేసి గ్రైండ్ చేయాలి.
- ఒక సర్వింగ్ గ్లాస్‌లో సబ్జా గింజలు, మిగిలిన తాటి ముంజల ముక్కలు, రెండు ఐస్ క్యూబ్‌లు, మిక్సీ గిన్నెలోని మిశ్రమం వేయాలి. ఒక గ్లాసు చల్లని నీళ్లు పోయాలి. పైన పుదీనా ఆకులు వేసి సర్వ్ చేయాలి.



వీటిలో నీరు అధికంగా ఉంటుంది కాబట్టి శరీరానికి తగినంత తేమ అందుతుంది. నిర్జలీకరణ సమస్యలు రావు. తాటి ముంజలలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. కాబట్టి శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.

తాటి ముంజల పాయసం

కావాల్సిన పదార్థాలు

పాలు- ఒక లీటరు, పంచదార- ముప్పావు కప్పు, లేత తాటి ముంజలు- ఆరు, యాలకుల పొడి- అర చెంచా, బాదం పలుకులు- రెండు చెంచాలు, జీడిపప్పు పలుకులు- రెండు చెంచాలు, గులాబీ నీరు- ఒక చెంచా

తయారీ విధానం

జాగ్రత్తలు

- పాయసం చిక్కగా ఉండాలనుకుంటే... చిన్న గిన్నెలో ఒక చెంచా కస్టర్డ్ పౌడర్ వేసి, కొన్ని నీళ్లు పోయాలి. జారుగా కలిపి ఆ మిశ్రమాన్ని మరుగుతున్న పాలలో కలిపితే సరిపోతుంది.
- గులాబీ నీరు అందుబాటులో లేకపోతే నాలుగు రేకుల కుంకుమ పువ్వు వేసుకోవచ్చు.
- పంచదార వద్దనుకుంటే... మరిగిన పాలను స్టవ్ మీద నుంచి దించాక అందులో బెల్లం పొడి కలుపుకోవచ్చు.

- తాటి ముంజలకు తొక్క తీసి వీలైనంత సన్నగా తరగాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి పాలు పోసి పెద్ద మంట మీద పావుగంటసేపు మరిగించాలి. పాలను గరిటెతో తిప్పుతూ ఉండాలి. పాలు చిక్కగా అయ్యాక పంచదార పోసి కలపాలి. అయిదు నిమిషాల తరవాత పాలను స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. ఫ్రిజ్‌లో రెండు గంటలు ఉంచాలి. తరవాత ఈ చల్లటి పాలలో తాటి ముంజల తరుగు, గులాబీ నీళ్లు, బాదం పలుకులు, జీడిపప్పు పలుకులు, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. తరవాత చిన్న పింగాణీ గిన్నెల్లో పోసి సర్వ్ చేయడమే. ఈ పాయసం రుచి అద్భుతంగా ఉంటుంది.



తాటి ముంజలలో ఎ, బి, సి విటమిన్లతోపాటు ఐరన్, జింక్, ఫాస్పరస్, పొటాషియం లాంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి రక్తపోటు, మలబద్ధకం లాంటి సమస్యలను నివారిస్తాయి. శరీరంలో కణితులు, రొమ్ము క్యాన్సర్ రాకుండా నిరోధిస్తాయి. ముఖం మీద మొటిమలు, మచ్చలు, ముడతలు రాకుండా చేస్తాయి.

తాటి ముంజల కూర



కావాల్సిన పదార్థాలు

తాటి ముంజలు- నాలుగు, సన్నగా తరిగిన టమాటా ముక్కలు- అర కప్పు, ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, పచ్చి మిర్చి- రెండు, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, ఉప్పు- తగినంత, కారం- ఒక చెంచా, పసుపు- పావు చెంచా, ధనియాల పొడి- అర చెంచా, జీలకర్ర- పావు చెంచా, జీలకర్ర పొడి- అర చెంచా, కొత్తిమీర తరుగు- పావు కప్పు, నూనె- మూడు చెంచాలు

జాగ్రత్తలు

- తాటి ముంజల్ని మరీ లేతగా, మరీ ముదురుగా కాకుండా మధ్యస్థంగా ఉండేవి తీసుకోవాలి.
- నూనె వేడెక్కిన వెంటనే కొన్ని జీడిపప్పు పలుకులు వేస్తే కూర కమ్మగా ఉంటుంది.
- టమాటా ముక్కలను వీలైనంత సన్నగా తరగాలి. లేదంటే టమాటా పేస్టు వాడుకోవచ్చు.

తయారీ విధానం

- తాటి ముంజలకు తొక్క తీసి ఒక్కోదాన్ని నాలుగు ముక్కలుగా కోయాలి.
- స్టవ్ మీద కడాయి పెట్టి, నూనె వేసి వేడి చేయాలి. తరవాత జీలకర్ర, ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు, చిటికెడు ఉప్పు వేసి బాగా కలపాలి. రెండు నిమిషాల తరవాత తాటి ముంజల ముక్కలు, పసుపు, కారం, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. రెండు నిమిషాల తరవాత టమాటా ముక్కలు, ధనియాలపొడి, జీలకర్ర పొడి, కొత్తిమీర తరుగు వేసి కలపాలి. మూతపెట్టి అయిదు నిమిషాలు మగ్గించాలి. తరవాత కడాయిని స్టవ్ మీద నుంచి దించి కూరను వేరే గిన్నెలోకి తీయాలి. ఈ తాటి ముంజల కూర... అన్నం, చపాతీ, పుల్కాల్లోకి రుచిగా ఉంటుంది.

ఎండాకాలంలో తాటి ముంజలు తినడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది. వడదెబ్బ తగలదు. శరీరంలో పేరుకున్న విషపదార్థాలు తొలగిపోతాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

భోజన కుతూహలం

పల్లేరుతో భేషైన ఆరోగ్యం..!

పల్లేరు మనకు చాలా ప్రాంతాల్లో కనిపిస్తూ ఉంటుంది. చాలా మంది దీన్ని పిచ్చి మొక్క అనుకుంటారు. కానీ పల్లేరు కాయలు, ఆకుల వల్ల అమితమైన ప్రయోజనాలున్నాయని ఆయుర్వేద గ్రంథాలు చెబుతున్నాయి.



పల్లేరును సంస్కృతంలో 'గోక్షురం' అని పిలుస్తారు. 'గోక్షురం' అంటే శరీరానికి చల్లదనాన్ని, బలాన్ని, పుష్టిని అందించేదని అర్థం. పల్లేరుకాయలు చిన్నవి, పెద్దవి అని రెండు రకాలుగా ఉంటాయి. పెద్ద పల్లేరుకాయల్ని 'గజపల్లేరు' అంటారు. ఈ కాయను రెండుగా చీలిస్తే- లోపల భాగమంతా జిగురుగా ఉంటుంది. ఈ జిగురు మన శరీరానికి ఎంతో ఉపకరిస్తుంది. కేవలం జిగురు మాత్రమే కాదు, పల్లేరు ఆకులు, కాయలు, వేర్లు... ఇవన్నీ త్రిదోష సమతుల్యతను కలిగిస్తాయి. చిన్న పల్లేరు కాయలకు కూడా ఈ తరహా గుణాలే ఉంటాయి. పల్లేరు కాయలు, ఆకుల వల్ల కలిగే ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం.

- పల్లేరు ఆకులను ఎండబెట్టి వాటితో ఉదయాన్నే టీ చేసుకొని తాగితే చర్మానికి కాంతి వస్తుంది.
- పల్లేరు ఆకులను సలాడ్‌లో వేసుకొని తింటే మూత్రంలో మంట తగ్గుతుంది. మూత్రనాళంలోని రాళ్లు కరిగిపోతాయి.
- పల్లేరు కాయలను ఎండబెట్టి కషాయంగా చేసి తాగితే హార్మోన్ల అసమతౌల్యం కలిగే రకరకాల సమస్యలు తగ్గుతాయి. యువతులను వేధించే 'పోలిసిస్టిక్ ఓవేరియన్ డిసీజ్' (పీసీఓడీ)కు కూడా ఇది మంచి పరిష్కారం.
- పల్లేరు కాయలు స్ఫటికం మాదిరిగా ముళ్లు ముళ్లుగా ఉంటాయి. ఈ కాయలలోని గుజ్జును ఏదో ఒక రూపంలో తీసుకుంటే మూత్రపిండాల్లో పేరుకున్న రాళ్లు కరుగుతాయి.
- పల్లేరు ఆకులు, కాయలు, వేర్లను ఎండబెట్టి... పొడి చేసి దాన్ని కూరల్లో వాడుకుంటే రకరకాల ప్రయోజనాలు ఉంటాయి.

● గంగరాజు అరుణాదేవి

మూతల రంగుల్లో మర్మం ఇదే..!



మనం సాధారణంగా బయటికి వెళ్లినప్పుడు లేదా ప్రయాణాల్లో దాహమనిపిస్తే వెంటనే వాటర్ బాటిల్ కొనుక్కుని నీళ్లు తాగేస్తూ ఉంటాం. ఈ బాటిళ్లకు పలు రంగుల మూతలు ఉండడాన్ని చాలామంది గమనించే ఉంటారు. ఈ రంగు మూతలు ఆ బాటిళ్లలోని నీటి గురించి తెలియజేస్తాయంటున్నారు నిపుణులు. ఆ వివరాలు...

నీలం: మనకు తరచుగా లభ్యమయ్యే వాటర్ బాటిళ్లకు నీలం రంగు మూతలు ఉంటాయి. అంటే ఆ బాటిళ్లలోని నీటిని నదులు, చెరువులు లాంటి సహజ వనరుల నుంచి సేకరించి శుద్ధి చేశారని అర్థం. ఈ నీటిలో లవణాలు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. అందుకే ఈ నీటిని 'మినరల్ వాటర్' అంటారు.

ఆకుపచ్చ: ఇవి కాస్త అరుదుగా కనిపిస్తూ ఉంటాయి. పెద్ద సూపర్ మార్కెట్లలో, షాపింగ్ మాల్స్‌లో, ఫైవ్ స్టార్ హోటళ్లలో ఇవి లభ్యమవుతాయి. ఆకుపచ్చ మూత ఉంటే ఆ బాటిల్‌లో ఉన్నది 'ఫ్లేవర్డ్ వాటర్' అని అర్థం. కొన్ని రకాల నేచురల్ ఫ్లేవర్స్‌ను స్వల్ప మోతాదులో కలపడం వల్ల ఈ నీరు ప్రత్యేకమైన రుచితో ఉంటుంది.



నలుపు: నలుపు రంగు మూత ఉన్న వాటర్ బాటిల్స్ కూడా అరుదుగానే కనిపిస్తాయి. వీటి ధర ఎక్కువగా ఉంటుంది. వీటిని సెలబ్రిటీలు, వ్యాపారవేత్తలు కొంటూ ఉంటారు. నల్లని మూత ఉంటే ఆ బాటిల్‌లో ఉన్నవి... 'ఆల్కలైన్ కలిపిన నీళ్లు' అని అర్థం. ఈ నీళ్లు తాగితే కడుపులో ఆమ్లత్వం, ఇతర జీర్ణాశయ సమస్యలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. వీటిలో క్షార పదార్థాలు, మినరల్స్ కూడా కలుపుతారు.

తెలుపు: తెల్లని మూత ఉన్న వాటర్ బాటిల్స్ సాధారణంగా అన్ని చోట్లా దొరుకుతూనే ఉంటాయి. వీధి చివరన ఉండే చిన్న కొట్లు, కిరాణా షాపులు, కూల్‌డ్రింక్ షాపులు, బస్టాండ్లలో ఇవి విరివిగా లభ్యమవుతూ ఉంటాయి. తెలుపు మూత ఉంటే ఆ బాటిల్‌లో ఉన్నవి 'బాగా శుద్ధి చేసిన నీళ్లు' అని అర్థం. వీటిలో ఎటువంటి మినరల్స్ ఉండవు. కేవలం దాహం తీర్చుకోవడానికి పనికొస్తాయి.

పసుపు, ఎరుపు, గులాబీ రంగులు: పసుపు రంగు మూత ఉంటే ఆ నీళ్లు విటమిన్లు, ఎలక్ట్రొలైట్లు కలిపినవనీ, ఎరుపు రంగు మూత ఉంటే అవి కార్బొనేటెడ్ నీళ్లు అనీ తెలుసుకోవచ్చు. గులాబీ రంగు మూత ఉంటే అది నీటిని గురించి తెలియజేసేది కాదు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు రొమ్ము క్యాన్సర్ గురించి అవగాహన కల్పించేందుకు ఉద్దేశించినది.

మేకప్

మదర్స్ డే మేకప్

మదర్స్ డే నాడు మనోహరంగా కనిపించాలంటే 30 ఏళ్లు పైడిన తర్వాత ముఖంలో ప్రతిఫలించే గీతలు, మచ్చలను మేకప్‌తో దాచేయాలి. తోటి తల్లులందరిలో మెరుపులీనుతూ కనిపించడం కోసం... ఇవిగో ఈ ప్రాథమిక మేకప్ చిట్కాలు పాటించండి.

హైడ్రేషన్ కోసం: వేసుకునే మేకప్ ముఖం మీద సమంగా పరుచుకోవడం కోసం ముందుగా చర్మాన్ని సిద్ధం చేయాలి. అందుకోసం ఫేసియల్ సీరమ్‌ను ముఖం మీద అద్దుకోవాలి. ఈ సీరం జిడ్డుగా ఉండకుండా చర్మానికి తేమతో పాటు, సన్‌స్క్రీన్ రక్షణ కూడా అందించేలా ఉండాలి. ఈ సీరమ్ చర్మంలో చక్కగా ఇంకిపోయిన తర్వాతే మేకప్ మొదలు పెట్టాలి.

ద్రవరూప ఫౌండేషన్: ముఖం మీద ఉండే సన్నని గీతల్లో ఇరుక్కుపోయి ఎబ్బెట్టుగా కనిపించకుండా ఉండాలంటే తేలికపాటి ద్రవరూప ఫౌండేషన్ ఎంచుకోవాలి. ఈ రకమైన ఫౌండేషన్ చర్మం మీద పలుచగా పొరలా ఏర్పడి ఆ తర్వాత వేసుకోబోయే కాంపాక్ట్, బ్లష్‌లకు అనువుగా ఉంటుంది. అయితే ఫౌండేషన్‌ను నేరుగా అప్లై చేసుకోకుండా, మొదట ముఖమంతా అక్కడక్కడా చుక్కలుగా అద్దుకుని, ఆ తర్వాత స్పాంజ్‌తో ముఖమంతా పరుచుకునేలా చేయాలి

తడిపిన స్పాంజ్‌తో: ఫౌండేషన్, కన్‌సీలర్‌ల కోసం తడిపి పిండిన మేకప్ స్పాంజ్ వాడుకోవాలి. ఈ పద్ధతితో మేకప్ ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా ఉంటుంది. మరింత సహజసిద్ధంగా కనిపిస్తుంది. అయితే స్పాంజి తేమగా ఉండాలే తప్ప నీరు కారుతూ ఉండకూడదు. అందుకోసం స్పాంజిని గోరువెచ్చని నీటి ధార కింద ఉంచి, గట్టిగా పిండేయాలి.

ద్రవరూప బ్లష్: బ్లష్‌తో అందం రెట్టింపవుతుంది. అయితే అందుకోసం సరైన రంగులను ఎంచుకోవాలి. ముదురు రంగు బ్లష్‌లు, మరీ మెత్తని పౌడర్ రూపంలో ఉండే బ్లష్‌లు ఎబ్బెట్టుగా కనిపిస్తూ, చర్మపు గీతల్లో ఇరుక్కుపోతాయి. కాబట్టి పౌడర్ బ్లష్‌లకు బదులుగా ద్రవరూప బ్లష్‌లు ఎంచుకోవాలి. వీటిని కూడా తడిపి పిండిన స్పాంజితోనే అద్దుకోవాలి.



తులసి ప్రయోజనాలెన్నో!

తులసి మొక్కను మనం పవిత్రంగా భావిస్తాం. దానిని అనునిత్యం పూజిస్తాం. అలాంటి తులసిలో విటమిన్-ఎ, యాంటీ ఆక్సిడెంట్లు తాంటివి పుష్కలంగా ఉంటాయి. అందుకే తులసి ఆకులను తినడం, తులసి కషాయం, తులసి టీ తాగడం... ఇలా ఏదో ఒక రూపంలో తులసిని తీసుకోవడం వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అవేమిటో తెలుసుకుందాం.



- ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపున తులసి ఆకులను తినడం వల్ల చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి.
- తులసి కషాయం తాగడం వల్ల ఒత్తిడి తగ్గడంతో పాటు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది.
- తులసి ఆకులు తినడం వల్ల గుండె ఆరోగ్యంతో పాటు జీర్ణక్రియ మెరుగుపడుతుంది.

సెలబ్ ఫిట్

నవయవ్వన సోయగం

తారాజువ్వలా వెండితెర మీదకు దూసుకువచ్చింది. సల్మాన్ లాంటి స్టార్ల సరసన అందంగా ఒదిగిపోయింది. నవయవ్వన కాంతితో యువతరం హృదయ స్పందనై వెలిగింది. పరిశ్రమలోకి వచ్చి పదిహేనేళ్లు దాటినా... నేటికీ అదే మైమరిపించే రూపు... చూపు తిప్పుకోనివ్వని నాజూకు... జాక్వెలిన్ ఫెర్నాండెజ్.



స్వదేశం శ్రీలంక. పుట్టింది బహ్రైన్‌లో. డిగ్రీ... ఆస్ట్రేలియాలోని సిడ్నీ విశ్వవిద్యాలయంలో. ఆమె తండ్రి ఎల్రాయ్ ఫెర్నాండెజ్‌ది శ్రీలంక. తల్లి కిమ్‌ది మలేషియా, కెనడా మూలాలున్న కుటుంబం. శ్రీలంకలో సింహళీస్, తమిళుల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణంతో జాక్వెలిన్ తండ్రి దేశం వదిలి బహ్రైన్‌కు వెళ్లి స్థిరపడ్డారు. అక్కడ ఎయిర్‌హోస్టెస్‌గా పని చేస్తున్న కిమ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాల మధ్య పెరిగిన జాక్వెలిన్‌కు అక్క, ఇద్దరు అన్నలు. సిడ్నీ వర్సిటీ నుంచి మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ పట్టా పొందిన ఆమె... కొంత కాలం టీవీ రిపోర్టర్‌గా పని చేసింది. గ్లామర్ ప్రపంచంలోకి రావాలన్న ఆసక్తితో మోడలింగ్ మొదలుపెట్టింది. 2006లో 'మిస్ యూనివర్స్ శ్రీలంక' కిరీటాన్ని దక్కించుకుని, తన దేశం నుంచి 'మిస్ యూనివర్స్'కు పోటీపడింది.

అలా వచ్చి...

మూడేళ్ల తరువాత ఓ మోడలింగ్ ప్రాజెక్ట్ కోసం భారత్‌కు వచ్చిన జాక్వెలిన్... అదే సమయంలో నిర్వహించిన 'అలాదిన్' చిత్రం ఆడిషన్స్‌కు వెళ్లింది. దర్శకుడు సుజోయ్ ఘోష్‌ను ఆమె రూపం ఆకట్టుకుంది. ఇక అప్పటి నుంచి జాక్వెలిన్‌కు భారత్ మరో ఇల్లు అయింది. అలా 2009లో నటిగా తొలి అడుగు వేసిన జాక్వెలిన్... మహేష్‌భట్ 'మర్డర్2'తో మొదటి హిట్ అందుకుంది. సల్మాన్‌ఖాన్ సరసన తెలుగు చిత్రం 'కిక్' రీమేక్‌లో నటించింది. ఆమె కెరీర్‌లోనే భారీ కలెక్షన్లు రాబట్టిన సినిమా అది. తెలుగు, కన్నడల్లో పలు ప్రత్యేక గీతాల్లో మెరిసిన జాక్వెలిన్... ఈ పదిహేనేళ్లలో 35కు పైగా చిత్రాల్లో నటించింది. ప్రస్తుతం ఆమె చేతులో రెండు ప్రాజెక్టులు ఉన్నాయి. నటి కావాలన్నది చిన్ననాటి కోరిక. హాలీవుడ్ తారగా వెలిగిపోవాలని కలలు కనేదట. జయాపజయాలతో సంబంధం లేకుండా దూసుకుపోతున్న ఆమె జీవితాన్ని 2021లో మనీ లాండరింగ్ కేసు కుదిపేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన సుఖేష్ చంద్రశేఖర్ నుంచి ఖరీదైన బహుమతులు అందుకుందన్నది జాక్వెలిన్‌పై ఆరోపణ. ఇది ఆమె కెరీర్‌నే కాదు, జీవితాన్ని కూడా ఎంతో ప్రభావితం చేసింది. కానీ ఆత్మస్థైర్యం కోల్పోకుండా తిరిగి నిలబడేందుకు ప్రయత్నిస్తోంది. ఇలాంటి ఒత్తిడుల నుంచి తనను రక్షిస్తున్నది, ఆరోగ్యంగా ఉంచుతున్నది ఫిట్‌నెస్ అంటుంది జాక్వెలిన్.

- తెల్లవారుజామున ఐదు గంటలకే జాక్వెలిన్ దినచర్య మొదలవుతుంది.
- ఉదయం లేవగానే తేనె, నిమ్మ రసం కలిపిన గ్లాసుడు గోరువెచ్చని నీరు
- బ్రేక్‌ఫాస్ట్‌లో ఉడకబెట్టిన గుడ్లు, తాజా పండ్లు, గ్రీన్ టీ.
- మధ్యాహ్న భోజనంలో పప్పుతో బ్రౌన్ రైస్, వెజిటబుల్, ఫ్రూట్ సలాడ్‌లు. వీటితోపాటు పిండి, పీచు పదార్థాలు, పోషక విలువలు పుష్కలంగా ఉండే క్వినోవా ఆమె మెనూలో తప్పనిసరి.
- అలాగే సలాడ్‌లు, వంటల్లో రెడ్, యల్లో క్యాప్సికమ్, చిలకడదుంపలు చేరతాయి.
- ఇంటర్మిటెన్ ఫాస్టింగ్‌కు ప్రాధాన్యం ఇస్తుంది. తీపి పదార్థాలకు దూరంగా ఉంటుంది.
- రాత్రిపూట తేలికపాటి భోజనం. సాధ్యమైనంతవరకు రాత్రి ఏడు గంటలకల్లా డిన్నర్ ముగిస్తుంది.



ఆదివారమూ విరామం లేదు...

ఇతర తారలకు భిన్నంగా... జాక్వెలిన్ రోజూ కంటే ఆదివారం వ్యాయామాల కోసం మరింత ఎక్కువ సమయం కేటాయిస్తుందిట. "యోగా, వెయిట్ ట్రైనింగ్, డ్యాన్స్‌లు కలగలిపి ఆదివారం నా వర్కవుట్ రెండు నుంచి మూడు గంటలపాటు తీవ్రంగా సాగుతుంది. కొంతమంది అంటుంటారు... 'నాక్కూడా నీలాంటి దృఢమైన ఆకృతి కావాల'ని. ఇది ఒక్క రోజులో వచ్చింది కాదు. కొన్నేళ్లుగా ఇదే రూపాన్ని కాపాడుకొంటూ వస్తున్నా. క్రమం తప్పని ఆహార నియమాలు పాటిస్తున్నా. నా రూపు అథ్లెట్లను తలపించాలని కోరుకొంటాను. ఎప్పుడూ దృఢంగా, ఉల్లాసంగా, చురుగ్గా ఉండటానికి ప్రయత్నిస్తాను. అవసరమైనప్పుడు కావల్సినంత విశ్రాంతి తీసుకొంటాను" అంటున్న ఈ ముద్దుగుమ్మ తరచూ తన ఫిట్‌నెస్ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసి, అభిమానులకు ప్రేరణ కలిగిస్తుంటుంది. ఇన్‌స్టాలో ఏడు కోట్ల మందికి పైగా ఫాలో అవుతున్నారంటే ఆమె క్రేజ్ ఏస్థాయిలో ఉందో వేరే చెప్పనక్కర్లేదు.

- జాక్వెలిన్ వ్యాయామాల్లో ప్రధానంగా యోగ ఉంటుంది.
- ఉదయం లేవగానే జాగింగ్, రన్నింగ్‌తో కూడిన కార్డియో తరువాత యోగా, పిలెట్స్, స్ట్రెంత్ ట్రైనింగ్
- రోజూ ఒకటే రకం వర్కవుట్స్‌తో ఆసక్తి తగ్గుతుంది. అందుకని తనను తాను ఉత్సాహపరుచుకోవడానికి ఎప్పటికప్పుడు కొత్త కొత్త లక్ష్యాలు నిర్దేశించుకొంటుంది.
- వ్యాయామాలను ఉత్సాహభరితంగా మార్చేందుకు పోల్‌డ్యాన్స్, ఏరియల్ సిల్క్ ఎక్సర్‌సైజ్‌లు చేస్తుంది. పోల్ డ్యాన్స్ తనలో ఆత్మవిశ్వాసాన్ని ఎలా నింపిందో, శరీరాన్ని మరింత దృఢంగా ఎలా మార్చిందో వివరిస్తూ ఆ మధ్య ఇన్‌స్టాలో ఒకపోస్టు పెట్టింది జాక్వెలిన్.

కాకర చేదు తగ్గాలంటే!

కాకరకాయలో ఎన్నో పోషకగుణాలు ఉన్నాయి. కానీ చేదుగా ఉంటుందని చాలామంది దానితో చేసే వంటలను ఇష్టపడరు. అయితే చిన్న చిన్న చిట్కాలు పాటించి కాకరకాయ చేదును తగ్గించవచ్చు. అవేంటో తెలుసుకుందాం!



- కాకరకాయపైన ఉండే గరుకు భాగాన్ని తొలగించేయాలి. దీని వల్ల సగం చేదు తగ్గుతుంది.
- కాకరకాయ ముక్కలకు ఉప్పు రాసి 20-30 నిమిషాల ఉంచి తరువాత ఆ ముక్కలను నీళ్లతో మూడు నాలుగు సార్లు శుభ్రంగా కడగాలి. దీని వల్ల చేదు కూడా తగ్గుతుంది.
- వేడి నీటిలో ఉప్పు వేసి అందులో కాకరముక్కలను నానబెట్టినా చేదును తగ్గించవచ్చు.
- కాకరకాయలో విత్తనాలు తీసివేయడం వల్ల కూడా చేదు తగ్గుతుంది.
- కాకర ముక్కలకు పెరుగు రాసి గంటసేపు పక్కన పెడితే చేదు చాలావరకూ తగ్గిపోతుంది.

రామావతారంలో చిన వెంకన్న



ధనుర్బాణాలను ధరించి శ్రీరామునిగా చిన్న తిరుమలేశుడు భక్తజనులను అనుగ్రహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరుగుతున్న అలంకారాల్లో శుక్రవారం వేంకటేశ్వరస్వామి రామునిగా శ్రీవారు కనువిందు చేశారు.



గజసేవతో సూర్యప్రభపై తిరువీధుల్లో విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

సూర్య, చంద్రప్రభ వాహనాలపై ఊరేగింపు

ద్వారకాతిరుమల, మే 9 (ఆంధ్రజ్యోతి): సప్త అశ్వాలను అధిరోహించిన సూర్యభగవానుడిని వాహనంగా చేసుకుని చిన్నతిరుమలేశుడు శుక్రవారం ఉదయం పురవీధుల్లో భక్తులను అనుగ్రహించారు. ఉదయం ఆలయంలో సూర్యప్రభ వాహనంపై ఉభయదేవేరులతో శ్రీవారిని ప్రత్యేక అలంకరణ చేసి హారతులిచ్చారు. అనంతరం మేళతాళాలు మంగళ వాయిద్యాల నడుమ గజసేవతో అట్టహాసంగా తిరువీధులకు తీసుకెళ్లారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై భక్తులకు కనువిందు చేశారు.

చిన వెంకన్నకు టీటీడీ పట్టు వస్త్రాలు

చిన్నతిరుమలేశునికి ఆదివారం జరగనున్న దివ్య కల్యాణమహోత్సవాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన అధికారులు పట్టు వస్త్రాలు అందజేశారు. పట్టువస్త్రాలను శిరస్సుపై ఉంచుకుని ఆలయ ఆవరణలో ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఏఈవో నటరాజారావుకు అందించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణం రోజున తిరుమల దేవస్థానం తరపున అందించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న కత్తిమండ ప్రతాప్

నేటి నుంచి తెలుగు సాహితీ సంబరాలు

ఏలూరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): వర్ధమాన కవులు, కళాకారులు, రచయితలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తెలుగు సాహితీ సంబరాలు నిర్వహిస్తున్నామని శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. ఏలూరులో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 10, 11 తేదీలలో కవితోత్సవం, తెలుగు సాహితి సదస్సు, చర్చా గోష్టి, రంగస్థల ప్రదర్శనలు, సాంప్రదాయ కళా ప్రదర్శనలు జరుగుతాయని ఆయన తెలిపారు. రెండు రోజులు పాటు జరిగే ఈ కార్యక్రమంలో రెండు వేల మంది కవులు, రచయితలు, కళాకారులు పాల్గొననున్నారన్నారు. ఈనెల 11న అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా అమ్మకు వందనం పేరిట అవార్డులు ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జి.ఈశ్వరి భూషణం, ప్రధాన కార్యదర్శి టి.పార్థసారథి, సంజయ్ కృష్ణ, గురుశర్మ, లేళ్ళ వెంకటేశ్వరరావు, ఐజాక్, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా టీచర్ల పదోన్నతులకు

వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

ఏలూరు అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, మునిసిపల్ పాఠశాలల ఉపాధ్యాయుల పదోన్నతులకు సాధారణ సీనియార్టీ జాబితా రూపొందించారు. ఈ జాబితా www.deoeluru.org వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో వెంకటలక్ష్మమ్మ శుక్రవారం తెలిపారు. ఉపాధ్యాయుల సమాచార వ్యవస్థ (టిస్) ఆధారంగా రూపొందించిన జాబితాల ప్రకారమే ఎస్టీటీలకు సబ్జెక్టులవారీగా స్కూల్ అసిస్టెంట్ కేడర్, స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్-2 హెచ్‌ఎం పదోన్నతులిచ్చేందుకు తాత్కాలిక సీనియార్టీ జాబితా అందుబాటులో ఉంచామన్నారు. ఈ జాబితాలపై ఎవరికైనా అభ్యంతరాలుంటే ఈ నెల 12 సాయంత్రంలోపు ఏలూరులోని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా డీఈవో కార్యాలయంలో సమర్పించాలన్నారు. అభ్యంతరాలను ఫిర్యాదుల పరిష్కార కమిటీ పరిశీలించి తుది నిర్ణయం తీసుకుని సంబంధిత టీచరు, హెచ్‌ఎంకు తెలియజేస్తామని వివరించారు.

తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



తాడేపల్లిగూడెం రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. పాకిస్థాన్ సరిహద్దులో యుద్ధ వాతావరణం నేపథ్యంలో రద్దీ ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్‌లో సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేపట్టారు.

మిలటరీ మాధవరం మహిళల

వీర సిందూరం



కుటుంబ సభ్యులను కదన రంగానికి పంపిన ధీర వనితలు

దేశం మొత్తం యుద్ధ వాతావరణం నెలకొంటే ఆ గ్రామంలో వీరత్వం ఉరకలేస్తుంది. ఆ ఊరిలో ఇంటికో సైనికుడు ఉన్నాడు. అదే మిలటరీ మాధవరం. యుద్ధ భయం వారి ఇంటి ఛాయలకు కూడా రాదు. సైన్యంలో ఉన్న బిడ్డలను యుద్ధంలో గెలిచి రా నాయనా అంటూ తల్లులు దీవిస్తున్నారు. భర్తలకు భార్యలు వీర తిలకం దిద్ది పంపుతున్నారు.

తాడేపల్లిగూడెం రూరల్, మే9 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంటి నుంచి సైన్యంలో చేరిన వారు ఎక్కువగా ఉండడంతో ఆ గ్రామాన్ని మిలటరీ మాధవరం అని పిలుస్తారు. గ్రామంలో ఏ ఇంట అబ్బాయిలు పుట్టినా సైనికుడిగా దేశ రక్షణకు పంపడం విశేషం. అమ్మాయిని సైనికుడి భార్యగా పంపుతారు. అది మిలటరీ మాధవరం గొప్పతనం. ప్రస్తుతం ఈ గామం నుంచి సుమారు 250 మందికి పైగా వివిధ విభాగాల్లో ఆర్మీలో సేవలందిస్తున్నారు. యుద్ధం సైరన్ మోగడంతో సెలవుపై గ్రామానికి వచ్చిన సైనికులు సుమారు 20 మంది వారి బెటాలియన్ క్యాంపులకు బయలుదేరారు. వారి తల్లులు, భార్యలు వీరతిలకం దిద్ది సమర రంగానికి పంపారు. ఆ వీర మాతలను, భార్యలను పలకరిస్తే దేశం కోసం ఎంతటి వారినైనా ఎదిరించే వారు తమ సొంతం కావడం గర్వంగా ఉందని చెబుతున్నారు.

కొడుకు, అల్లుడూ యుద్ధానికి వెళ్లారు



నాకు ఇద్దరు పిల్లలు, ఒకరు అబ్బాయి. మరోకరు అమ్మాయి. మా అబ్బాయి మాదాసు రమేశ్ ఉత్తరప్రదేశ్‌లో సైన్యంలో సేవలందిస్తున్నాడు. మా అమ్మాయిని కూడ ఓ సైనికుడికి భార్యగానే పంపించాను. ఇప్పుడు ఇద్దరూ సర్వీసులోనే ఉన్నారు. ప్రస్తుత పాక్ యుద్ధంలో భాగస్వాములవుతున్నందుకు ఎంతో గర్వపడుతున్నాం. మా అబ్బాయి. అల్లుడు ఇద్దరూ ప్రస్తుతం యుద్ధ ఏర్పాట్లలో భాగంగానే క్యాంప్‌లో ఉన్నారు.

- మాదాసు వరలక్ష్మి, మాధవరం

తమ్ముడూ, భర్త ఇద్దరూ సైనికులే..



మాది మాధవరం. మా తమ్ముడు ఆర్మీలోనే పని చేస్తున్నాడు. మా ఆయన కల్లపల్లి బాలసుబహ్మణ్యం అజ్మాల్‌లో పనిచేస్తున్నారు. ఆయన దేశ రక్షణలో ఉండడం ఒక రకంగా భయంగా ఉన్న ఓ వీర మహిళగా ప్రస్తుత యుద్ధంలో దేశం గెలిచి తీరాలని కోరుకుంటున్నాను. ఒక పక్క తోబుట్టువు, మరో పక్క కట్టుకున్న భర్త ఇద్దరూ దేశ రక్షణలో ఉండడం గర్వకారణం.

- కల్లపల్లి లక్ష్మి ప్రియాంక, ఏలూరు

మా ఊరి నుంచి 2 వేల మంది సైనికులు



భారత సైన్యంలో మా ఊరి నుంచి ఇప్పటి వరకూ 2వేలకు పైగా పనిచేశారు. ప్రస్తుతం 250 మంది పని చేస్తున్నారు. మా ఇంట్లో నా భర్త వెంకన్న ఆర్మీలో సుదీర్ఘకాలం సేవలందించారు. ఆయన ఆర్మీ నుంచి వచ్చాక గ్రామాభివృద్ధి చేసేందుకు నా ద్వారా గ్రామస్థులు అవకాశం ఇచ్చారు. ఆయన అనారోగ్యంతో మృతి చెందినా ఆయన స్ఫూర్తితో గ్రామాభివృద్ధి చేశాం. పాక్‌తో యుద్ధంలో మా గ్రామం నుంచి అత్యధికంగా సైనికులు ఉండడం మాకు గర్వకారణం.

- కౌలూరి పరిమళ, మాజీ సర్పంచ్ మాధవరం

ఇద్దరు కొడుకులూ సైన్యంలో ఉన్నారు



నాకు ఇద్దరు కుమారులు. వారిద్దరూ ప్రస్తుతం సైన్యంలోనే ఉన్నారు. పెద్దోడు కుమార్ జోధ్‌పూర్, చిన్నోడు రాజు గోవాలో విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరికి వివాహాలు అయ్యాయి. ఇద్దరినీ దేశ రక్షణ కోసం పంపడం చాలా గర్వంగా ఉంది. ప్రస్తుతం దేశం కోసం పోరాడాల్సిన అవకాశం ఇద్దరు కొడుకులకు రావడం సంతోషం. దేశం గర్వించేలా వారిద్దరూ పోరాడి పాకిస్థాన్‌ను ఎదుర్కొవాలని కోరుకుంటున్నాను.

- కుమ్మరపురుగు నాగ వెంకటలక్ష్మి మాధవరం

నా చిన్న కొడుకు దేశం కోసం పోరాడుతాడు



నాకు ఇద్దరు కొడుకులు ఉంటే వారిద్దరిని దేశ రక్షణకు పంపించాలనుకున్నా. మా చిన్నోడు దత్తాత్రేయకు ఆ అవకాశం వచ్చింది. ప్రస్తుతం పాకిస్థాన్‌పై యుద్ధ సమయంలో విధులు నిర్వహించే అవకాశం లభించడం మరింత ఆనందంగా ఉంది. మా వాడు సైనికుడిగా దేశం కోసం పోరాడి విజయంలో భాగస్వామిగా నిలవాలని నేను దేవుడిని కోరుకుంటున్నాను.

-కుప్పాల ఉమామహేశ్వరి, మాధవరం

నా భర్త విజయం సాధించి వస్తారు



మాది మాధవరం. మా గ్రామం అంటే జిల్లాలోనే కాదు రాష్ట్రంలో కూడా ఓ ప్రత్యేక స్థానం ఉంది. దానికి కారణం మా గ్రామంలో అంతా దేశ రక్షణలో ఉండడమే. దొండపూడికి చెందిన రాముతో నాకు వివాహమైంది. ఆయన కూడా ఆర్మీలోనే పనిచేస్తున్నారు. నాకు ఇటీవలే పాప పుట్టింది. ఆ పాపను చూసేందుకు వచ్చిన ఆయన్ను వెంటనే రావాలని ఆర్మీ నుంచి పిలుపు రావడంతో బయలుదేరారు. దేశ రక్షణే ముఖ్యం, విజయంతో తిరిగి రావాలని కోరుకుంటూ ఆయన్ని సాగనంపాం.

- మేడా వీర శేషు, మాధవరం

ఉగ్రవాదాన్ని అంతమొందించాలి




ద్వారకాతిరుమల విర్డ్‌లో పూజలు చేస్తున్న చిన జీయర్ స్వామి, ఏలూరులో ఆధ్యాత్మిక ప్రవచనం

» మోదీ సంకల్పానికి అండగా భగవంతుడిని ప్రార్థించాలి
» చిన జీయర్ స్వామి

ఏలూరు కార్పొరేషన్, మే 9 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఉగ్రవాదాన్ని పూర్తిస్థాయిలో అంతమొందించేందుకు కృషి చేస్తున్న ప్రధాని మోదీ సంకల్పానికి అందరం భగవంతుడిని ప్రార్థించాలని త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయరు స్వామి అన్నారు. ఆర్‌ఆర్ పేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయ విమాన సుదర్శన శిఖర ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన సందర్శించారు. దేశం కోసం పోరాడుతున్న జవానులకు మనోధైర్యాన్ని కలుగ చేసేందుకు అందరం సమష్టి కృషి చేద్దామన్నారు. మతం అడిగి హతమారుస్తున్న ఉగ్రవాదులను అంతమొందించాల్సిన అవసరం ఈ సమాజానికి ఎంతైనా ఉందన్నారు. సమాజంలో అసమానతలు తొలగాలని, అంతా సమతాభావం ఉండాలన్నదే రామానుజాచార్యుల ఆశయమన్నారు. సమాజ శ్రేయస్సు కోసం దేశభక్తితో పౌరులంతా ఏకాగ్రతతో ఉండాలన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బడేటి చంటి, ఆలయ ఈవో నల్లూరి సతీష్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

సమస్త సృష్టిలో భగవత్ స్వరూపం

ద్వారకాతిరుమల: సమస్త సృష్టిలో భగవత్ స్వరూపం నిండి ఉందని చిన జీయర్ స్వామి అన్నారు. ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రిని శుక్రవారం ఆయన సందర్శించారు. ఆయనకు శ్రీవారి ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, ఈవో ఎన్వీ సత్యనారాయణ మూర్తి తదితరులు స్వాగతం పలికారు. ఆసుపత్రి ఆవరణలో స్వామి వారికి పూజలు చేసి భక్తులకు ఆయన అనుగ్రహభాషణ చేశారు.



నాగభూషణం మృతదేహం

భార్యాభర్తల మధ్య విభేదాలు ఉరి వేసుకుని భర్త ఆత్మహత్య

పోలవరం మే 9: భార్యాభర్తల మధ్య కలహాల నేపథ్యంలో భర్త ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్‌ఐ కె.నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం పట్టిసీమ పంచాయతీ వీరభద్రపురానికి చెందిన మసకపల్లి నాగభూషణం(21) కొన్ని రోజులుగా భార్యతో విభేదాలు పొడచూపాయి. భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. మనస్తాపానికి గురైన నాగభూషణం గురువారం రాత్రి ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న వృద్ధుడిని కారు ఢీకొనడంతో మృతి చెందాడు. కృష్ణా జిల్లా బొమ్ములూరునకు చెందిన ముసునూరు రామకృష్ణంరాజు (60) శుక్రవారం రోడ్డు దాటుతుండగా కారు ఢీకొంది. తీవ్ర గాయాలైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా అత్యవసర వైద్య విభాగం వైద్యులు పరీక్షించి అతను అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు.

రైలు పట్టాలు దాటుతుండగా..

రైలు పట్టాలు దాటుతున్న యువకుడిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దెందులూరు మండలం కొవ్వలి గ్రామానికి చెందిన జాత్రి వెంకట ప్రవీణ్ (20) ఈనెల 8న రాత్రి పవర్‌పేట రైల్వే స్టేషన్ వద్ద రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందడంతో రైల్వే ఎస్‌ఐ పి.సైమన్ తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామ కార్యదర్శి విధులను అడ్డుకున్న వ్యక్తిపై కేసు

భీమడోలు, మే 9 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న మహిళా అధికారిని అడ్డుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు భీమడోలు పోలీసులు తెలిపారు. భీమడోలు గ్రామంలోని నెహ్రూనగర్‌కాలనీలో ఈనెల 7న కాలనీలో డ్రెయినేజీ తవ్వకం పనులు చేపట్టారు. గాంధీ అనే వ్యక్తి తన ఇంటి ముందు కచ్చా డ్రైన్ తవ్వద్దంటూ పంచాయతీ కార్యదర్శి తనూజను అడ్డుకుని, దుర్భాషలాడారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై దీనిపై భీమడోలు గ్రామంలోని పలు దళిత సంఘనేతలు అధికారిని అడ్డుకున్న సంఘటనను ఖండించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన సేవలందించండి

ఏలూరు జిల్లా ఆస్పత్రిలో వైద్య ఆరోగ్య శాఖ సీఎస్ కృష్ణబాబు

వైద్య కళాశాల భవన నిర్మాణ పనుల పరిశీలన



వైద్య కళాశాల భవనాలను పరిశీలిస్తున్న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు

ఏలూరు క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ వైద్యకళాశాల భవనాల నిర్మాణ పనులను పరిశీలించేందుకు శుక్రవారం ఏలూరు వచ్చారు. ఎమ్మెల్యే బడేటి చంటి ఆయనను కలిసి ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత, వైద్య పరికరాలు కొరత వివరించారు. వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టుల భర్తీకి కలెక్టర్ సూచనల మేరకు నోటిఫికేషన్ జారీ చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌ను కృష్ణబాబు ఆదేశించారు. అవసరమైన వైద్య పరికరాల కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. ఆపరేషన్ థియేటర్‌లో శస్త్ర చికిత్సకు అత్యవసర పరికరాలు ఆసుపత్రి అభివృద్ధి నిధుల నుంచి కలెక్టర్ అనుమతితో కొనుగోలు చేయాలన్నారు. ఇతర ఆసుపత్రులలో పని చేసే రేడియోలజిస్టులను గంటల ప్రాతిపదికన తాత్కాలికంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా అధికంగా శస్త్ర చికిత్సలు జరిగేలా వైద్యులు చూడాలన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని, సీసీ కెమెరాల ద్వారా వైద్య సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

సౌకర్యవంతమైన వసతి గృహాలు నిర్మించాలి

ప్రభుత్వ వైద్యకళాశాల విద్యార్థులకు సౌకర్యవంతమైన వసతి గృహాలు నిర్మించాలని కృష్ణబాబు అధికారులను ఆదేశించారు. సంక్షేమ వసతి గృహాల సముదాయం, ప్రభుత్వ వైద్య కళాశాల భవనాల నిర్మాణ పనులను కలెక్టర్ కె.వెట్రిసెల్వి, వైద్య విద్య సంచాలకుడు నరసింహం, ఏడీ వెంకటేశ్, ఎమ్మెల్యే బడేటి చంటి, అధికారులతో కలిసి కృష్ణబాబు పరిశీలించారు. రానున్న రోజులలో వైద్య కళాశాలలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, వివిధ వైద్య విభాలలో స్పెషలిస్ట్ కోర్సులు 750 మందిపైగా అభ్యసిస్తారని, ప్రస్తుతం ఉన్న భవనాలకు అదనంగా హాస్టల్ భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. వసతి గృహ భవనాలు వైద్యకళాశాలకు దగ్గరలో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. హాస్టల్ నిర్మాణానికి స్థలం వివరాలను అధికారులు స్పెషల్ సీఎస్‌కు వివరించారు. అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను కృష్ణబాబు స్వయంగా పరిశీలించారు.

జిల్లా వైద్యాధికారి మాలిని, డీసిహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ సతీష్, ఆర్డీవో అచ్యుత అంబరీష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి, వైద్యారోగ్యశాఖ మౌలిక సదుపాయల అభివృద్ధి సంస్థ చీఫ్ ఇంజనీర్ కె.శ్రీనివాస్, ఎస్ఈ బలరాంరెడ్డి, ఈఈ రాజబాబు, ఏలూరు తహసీల్దార్ శేషగిరిరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హాస్టల్ పిల్లలను సొంత బిడ్డల్లా సంరక్షించాలి

ఏలూరు క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో పిల్లలను సొంత బిడ్డల్లా చూసుకుని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. ఏలూరు శనివారపుపేటలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం సందర్శించి మాట్లాడారు. పిల్లలకు సంరక్షణ, వైద్యం, విద్య, శిక్షణ, అభివృద్ధి, పునరావాసం కోసం ఈ వసతి గృహాన్ని ఏర్పాటు చేశారన్నారు. అక్కడ అబ్జర్వేషన్ హోమ్‌లో ఉన్న బాలలతో ఆయన మాట్లాడారు. వారికి అవసరమైన న్యాయ సహాయాన్ని అందిస్తామన్నారు. వేసవి సెలవుల్లో బాలలకు నైపుణ్యాన్ని పెంచుకునేందుకు సాంకేతిక విద్యను బోధించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి : కట్లయ్య

ఏలూరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రజక వృత్తిదారులు అనేక గ్రామాల్లో వృత్తి సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి సమస్యలు పరిష్కరించాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజకజన సంఘ అధ్యక్షుడు చిలకపల్లి కట్లయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏలూరు జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో రజకులు కొన్ని చోట్ల నిరక్షరాస్యులైనందున ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకొనలేకపోతున్నారన్నారు. ఈ సందర్భంగా నూజివీడుకు చెందిన బుద్దవరపు గోపిరాజుని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజక జన సంఘానికి జాయింట్ సెక్రటరీగా నియమిస్తూ పత్రాన్ని అందజేశారు.

బిహార్ యువకుడి హల్‌చల్

పాలకోడేరు, మే 9(ఆంధ్రజ్యోతి): విస్సాకోడేరు గ్రామంలో బిహార్ యువకుడు అనుమానాస్పదంగా తిరగడంతో స్థానికులు భయపడ్డారు. అతడిని శుక్రవారం పాలకోడేరు పోలీసులకు అప్పగించారు. రైస్‌మిల్ సమీపంలోని ప్రైవేట్ పాఠశాల వద్ద బిహార్ యువకుడు అనుమానాస్పదంగా కనిపించాడు. స్థానికులు అతడిని ప్రశ్నించగా తాను ఈ పాఠశాలలో చదువుకుంటానని, ఇక్కడి నుంచి వెళ్లనని చెప్పాడు. అసలే భారత్ పాక్ మధ్య యుద్ధం జరుగుతుంది ఈ సమయంలో ఎక్కడ ఏం జరుగుతుందోనని జనం భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో హిందీ మాట్లాడుతూ భయబ్రాంతులకు గురి చేసే విధంగా ప్రవర్తించడంతో స్థానికులు పాలకోడేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు స్టేషన్లో మెన్ తక్కువగా ఉందని మీరే స్టేషన్‌కు తీసుకురావాలని చెప్పడంతో స్థానికులు అయోమయంలో ఉన్నారు. తర్వాత ఇంటెలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్ వర్మకు తెలపడంతో ఆయన తన బైక్‌పై యువకుడిని తీసుకువెళ్లి పోలీసులకు అప్పగించారు. దీనిపై పాలకోడేరు పోలీసులను వివరణ కోరగా ఆ యువకుడు బాగానే ఉన్నాడని, ఇటుక బట్టీల్లో చేస్తున్న యువకులను తీసుకువచ్చి ఇతని గురించి ఆరా తీయగా అన్ని సమాధానాలు బాగానే చెబుతున్నాడని బదులిచ్చారు. దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరుటూటౌన్, మే9(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ నుంచి స్వయం ఉపాధి పథకాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించామని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం. ముక్కంటి తెలిపారు. శుక్రవారం ఏలూరు కార్పొరేషన్ కార్యాలయంలో షెడ్యూల్ కులాల సంఘాలతో సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ లక్ష్యానికి తగ్గట్లుగా దరఖాస్తులు రానందున తొలుత ప్రకటించిన ఈనెల పదో తేదీ వరకు వున్న గడువును మరి కొద్దిరోజులు పొడిగిస్తున్నట్టు తెలిపారు.

వసంతవాడలో మట్టి నమూనాల సేకరణ

పెదపాడు, మే 9(ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లోని సేంద్రియ, క్షార లోపాలను గుర్తించడానికి మట్టి నమూనాలను గుర్తించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పెదపాడు ఏవో వి.ప్రదీప్‌కుమార్ తెలిపారు. వసంతవాడలో మట్టి నమూనాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం పర్యవేక్షించారు. మండలంలో 1,300 మట్టి నమూనాలను సేకరణ లక్ష్యంగా కాగా వాటిని ఆయా రైతు సేవా కేంద్రాలకు సిబ్బందికి తెలిపామన్నారు. మట్టి సేకరణ అనంతరం వాటిని పరీక్ష కేంద్రాలకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నామినేటెడ్ నిరీక్షణ

(5వ పేజీ తరువాయి)

పదవి ఖాయమనే ధీమాతో ఉండేవారు. డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ పదవుల్లో ఏదో ఒకటి తనకి దక్కకపోతుందా అని ఆశించారు. నామిటెడ్ పోస్టుల్లో ఏదో ఛాన్సు లభిస్తుందని కొత్తూరి బాపిరాజు, ఇందుకూరి రామకృష్ణంరాజు, మెరగాని నారాయణమ్మ, నెప్రూరా జనసేనకు చెందిన నేతలంతా ఉన్నారు. ఏలూరులో సీనియర్ నేత ఎంఆర్‌డీ బలరాం, మధ్యాహ్నపు ఈశ్వరి, కంప్యూటర్ ప్రసాద్, కడియాల విజయలక్ష్మి, కొల్లేపల్లి రాజు వంటి ముఖ్య నేతలపై నామినేటెడ్ ప్రచారం సాగుతోంది. చింతలపూడి నియోజకవర్గానికి చెందిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యాంచంద్రశేష బీసీ వర్గాల నుంచి ఏదో ఒక అవకాశాన్ని కోరుకుంటున్నారు. పార్టీ ముఖ్యులతోపాటు సీఎం చంద్రబాబు, యువనేత లోకేశ్ వంటి వారిని పలుమార్లు కలిసి తనకు అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. నూజివీడు, కైకలూరులో పార్టీలోని సీనియర్లు అంతా పలుమార్లు పార్టీలో రాష్ట్రస్థాయి నేతలకు తమగోడు వెళ్లబోస్తున్నారు. నరసాపురంలో డాక్టర్ రాజ్యలక్ష్మి, కొల్లు పెద్దిరాజు, కొప్పాడ రవి, ఆచంటలో గొడవర్తి శ్రీరాములు, తణుకులో దొమ్మేటి వెంకటసుధాకర్ వంటి వారంతా నామినేటెడ్ లిస్టులో తమకు గౌరవం దక్కుతుందన్న అంచనాల్లో వున్నారు. తాడేపల్లిగూడెంలో పరిమి రవికుమార్, వాడపల్లి వెంకటసుబ్బరాజు, దాసరి అప్పన్న, పాతూరి రాంప్రసాద్‌చౌదరి వంటి వారు పోలవరంలో మేఘాలాదేవితోపాటు ఒక అరడజను నేతలు ఆశలు పెంచుకున్నారు. జనసేన, బీజేపీ పక్షాన సైతం కొందరి పేర్లు తెరముందుకు వచ్చినా జాబితాలో చోటు ఎంత వరకూ దక్కుతుందనేది అనుమానంగానే ఉంది.

ఆయిల్‌పామ్ సాగు మరింత పెంచుతాం : చింతమనేని



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగును మరింతగా పెంచి, రైతుల ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయిల్‌పామ్ సాగు పెంచడానికి తీసుకోవాల్సిన అంశాలపై ఉద్యానశాఖాధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదవేగి, దెందులూరు, పెదపాడుల్లో ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలమని, దీన్ని మరింతగా విస్తరించేందుకు అన్ని అంశాలను పరిశీలిస్తున్నామన్నారు. గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి, రైతులను సమాయత్తం చేసే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ఆయిల్‌పామ్, కొబ్బరి, నిమ్మతోపాటు అంతర పంటల సాగును ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోవాలని ఉద్యాన శాఖాధికారులను ఆదేశించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : బొరగం



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బొరగం శ్రీనివాసులు

పోలవరం, మే 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పోలవరంలో ఆయన నివాసం వద్ద ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. రోడ్లు, మంచినీరు, పునరావాస కాలనీల మౌలిక వసతుల సదుపాయాల కల్పనపై ప్రజల నుంచి వినతిపత్రాలు అందాయని సమస్యలను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు అనపర్తి వెంకటనారాయణ, పార్టీ మండల అధ్యక్షులు బొడ్డు కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి నునకాని రాంబాబు, మాజీ ఉప సర్పంచ్ మంగిన కొండ, పసుమర్తి భీమేశ్వరరావు, పోతుల శ్రీను, దూసనపూడి పోశిబాబు, సత్యనారాయణ, నారాయణరావు, యడ్ల వినోద్, మానికల శ్రీను, బన్ను తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణే లక్ష్యంగా పథకాలు అమలు

పెదవేగి, మే 9(ఆంధ్రజ్యోతి):బాలికల సంరక్షణకు ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని జిల్లా శిశు సంక్షేమశాఖ పీడీ పి.శారద అన్నారు. శుక్రవారం బాపిరాజుగూడెం, విజయరాయి, నడిపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల సంపూర్ణ ఆరోగ్యంకోసం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార సరుకులను అందిస్తోందన్నారు. కనీస వయస్సు లేకుండా వివాహం చేయడం నేరమన్నారు. విజయరాయి సెక్టారు సూపర్‌వైజర్ కె.మేరీబాయిమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

వస్తువులు కొనేటప్పుడు వివరాలు పరిశీలించాలి

ఏలూరుటూటౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్యాకేజీలో ఉన్న వస్తువులు కొనేటప్పుడు వినియోగదారులు సంబంధిత వివరాలను పరిశీలించాలని డిప్యూటీ కంట్రోలర్ హరిప్రసాద్ సూచించారు. శుక్రవారం తూనికల, కొలతల శాఖ ఆధ్వర్యంలో ఏలూరు డీమార్ట్ వద్ద వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్యాకేజీలో ఉన్న వస్తువులు కొనేటప్పుడు తయారీదారిపేరు, లోపల వస్తువుపేరు, నికర బరువు, ప్యాకేజీ తయారీ తేదీ, ఎంఆర్‌పీ ధర, టోల్‌ఫ్రీ ఫోన్ నెంబర్, తదితరాలు ముద్రించి ఉండాలన్నారు. వీటిలో ఏదైన కచ్చితత్వం లేకపోతే తూనికల, కొలతల శాఖాధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. అసిస్టెంట్ కంట్రోలర్స్ సాయిరామ్, నాగరాజారావు, పరిశీలకులు ప్రశాంత్, సత్యనారాయణ, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

'గిరిజనుల జీవన విధానంలో మార్పు రాలేదు'

వేలేరుపాడు, మే 9(ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధి కోసమని కేంద్రం రెండు తెలుగురాష్ట్రాల్లో ఎన్ని సంస్కరణలు తీసుకొచ్చిన ఆదివాసీ జీవన విధానంలో ఎటువంటి మార్పురాలేదని అఖిల భారత ఐక్యరైతు సంఘం జాతీయ కమిటీ నాయకులు ఎస్కే.గౌస్ విమర్శించారు. శుక్రవారం రామవరం పంచాయతీ యర్రటడలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల కోసం అనేక పోరాటాలు చేస్తున్న సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ కారణంగానే ఆదివాసీలకు ఎంతోకొంత న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు సిరికొండ రామారావు, కట్టం వీరాస్వామి, స్వయం చంద్రరావు, నాళవరం ఎంపీటీసీ కట్టం రత్తమ్మ, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చోడే విజయ, ఎస్కే.మున్నీ, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి

వేలేరుపాడు, మే9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వ్యవసాయానికి అనుసంధానం చేసి కూలి ధరలను పెంచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ మండల కార్యాలయంలో మండల కౌన్సిల్ సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి రోజువారీ కూలి రూ.600 అందేలా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా గండిపడిన పెదవాగు ప్రాజెక్టును ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల సమన్వయంతో మరమ్మతులు చేపట్టి సాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండీ మునీర్, జిల్లా కార్యవర్గ సభ్యులు తన్నీపల్లి సాయిబాబు, మండల కార్యదర్శి బాడిస రాము, రామవరం సర్పంచ్ పిట్టా ప్రసాద్, పాల్గొన్నారు.

200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

జీలుగుమిల్లి, మే 9: (ఆంధ్రజ్యోతి):జిల్లా ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు ఆధ్వర్యంలో దాడులు జరిపారు. కామయ్యపాలెం సమీప పొలాల్లో శుక్రవారం జరిగిన ఎక్సైజ్ దాడుల్లో నాటు సారా తయారీకి ఉపయోగించే 200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. ఐదు లీటర్ల సారా, స్వాధీనం చేసుకుని సిరిబత్తుల శ్రీనివాసరావుపై కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు, కానిస్టేబుళ్లు ఉన్నారు.

ఉగ్రవాదం నశించాలి

ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై హర్షం



జంగారెడ్డిగూడెంలో న్యాయవాదుల ప్రదర్శన

ఏలూరులో వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుల ర్యాలీ

ఏలూరు రూరల్/జంగారెడ్డిగూడెం, మే 9(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదం నశించాలని, ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం, యుద్ధంలో విజయం సాధించాలని అల్లూరి సీతారామరాజు వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఆకాంక్షించారు. శుక్రవారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో అల్లూరి సీతారామరాజు వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎం అక్బర్, విఘ్నేశ్వరరావు, మేరీ మాణిక్యం, జల్లా వీరభద్రరావు, జంపా సూర్యనారాయణ, గొంతిన రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ప్రదర్శన

భారత సైన్యం చేస్తున్న వీరోచిత పోరాటానికి జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘీభావం తెలుపుతూ శుక్రవారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీఎస్ఆర్. మూర్తి, మోడేపల్లి నాగులు, ప్రధాన కార్యదర్శి విత్తనాల రాజు, న్యాయవాదులు పొన్న లక్ష్మణరావు, ఎస్‌వీబీఎల్ ఆచారి, టి.ఎస్ఎస్.మూర్తి, అచ్యుత శ్రీనివాసరావు, జువ్వల బాబ్జీ, ఎంజీఆర్, బొడ్డు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అమర వీరుడు మురళీనాయక్‌కు నివాళి

ఏలూరు కార్పొరేషన్/బుట్టాయగూడెం/కామవరపుకోట, మే 9 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు మురళీనాయక్ అని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రానికి చెందిన సత్యసాయి జిల్లా గోరంట్ల మండలానికి చెందిన మురళీనాయక్ యుద్ధ భూమిలోనే ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. బుట్టాయగూడెంలో ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు నివాళులర్పించారు. కామవరపుకోట మండలం సీపీఐ కార్యాలయంలో శుక్రవారం టీవీఎస్.రాజు ఆధ్వర్యంలో సంతాప సభను నిర్వహించారు. మురళీ నాయక్ చిత్రపటానికి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు కంకిపాటి బుచ్చిబాబు, జి.సత్యనారాయణ, రమణ, ఎం.దుర్గారావు ఉన్నారు.

12న యూటీఎఫ్ నిరసన

ఏలూరు అర్బన్, మే9(ఆంధ్రజ్యోతి):పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, టీచర్ల సర్దుబాటు ప్రక్రియలపై ఏ విధమైన జీవోలు లేకుండానే ప్రభుత్వం చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 12న డీఈవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ తెలిపారు. శుక్రవారం డీఈవో వెంకటలక్ష్మమ్మకు ముందస్తు నోటీసును అందజేశారు. ఆయన మాట్లాడుతూ తొలుత ఈ నెల 12న డీఈవో కార్యాల యం వద్ద నిరసనను తెలియజేస్తామన్నారు. అనంతరం నిరసన కార్యక్రమం నోటీసును కలెక్టర్ కార్యాలయంలో అందజేశామన్నారు. సంఘ నాయకులు సుభాషిణి, రంగమోహన్, రాంబాబు, మోహన్‌రా వు, జక్రియ, తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంపై గిరిజనులకు శిక్షణ

బుట్టాయగూడెం, మే 9(ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులకు తేనెటీగల పెంపకంపై శాస్త్రవేత్తలు, అధికారులు అందించారు. శుక్రవారం మండలంలోని కామయ్యకుంట, రాజానగరం, చీమలవారిగూడెం, పులిరాముడుగూడెం గ్రామాలకు చెందిన గిరిజన రైతులకు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో విజయరాయి వ్యవసాయ పరిశోధన కేంద్రం వారు శుక్రవారం తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. మార్టేరు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు శ్రీనివాసరావు, రమేష్, రమణరావు, మోహనరావు హాజరై తేనెటీగల పెంపకం, నిర్వహణలను వివరించారు. కేఆర్‌పురం ఏడీ పి.బుజ్జిబాబు మాట్లాడారు. ఏవో డి.ముత్యాలరావు, గ్రామ సహాయకులు, మాజీ ఎంపీటీసీ మొట్టుం రమణ రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మహారాణాప్రతాప్ జయంతి

టి.నరసాపురం, మే9(ఆంధ్రజ్యోతి):టి.నరసాపురం పంచాయతీ కృష్ణాపురం గ్రామంలో రాజపుత్రవీరుడు మహారాణాప్రతాప్ 486వ జయంతిని బంజార బజరంగిభేరి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బజరంగభేరి నాయకులు భూక్యా వేణుగోపాల్ మాట్లాడుతూ మొఘలాయి సామ్రాజ్యాన్ని ఎదిరించి పరాయిపాలనలో బానిసలుగా ఉండకుండా స్వతంత్రంగా జీవించాలని జీవితకాలం అంతా పోరాటం చేసిన తొలి భారత స్వాతంత్ర్య యోధుడు మహారాణప్రతాప్ అని అన్నారు. భూక్యా రామకృష్ణ నాయక్, భూక్యా రాములునాయక్, భూక్యా బిగనాధం నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఉత్తీర్ణతకు ప్రణాళికతో ముందుకెళ్లండి

దెందులూరు,మే 9 (ఆంధ్రజ్యోతి):పదో తరగతితోపాటు ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు ప్రణాళికతో ముందుకు వెళ్లాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. శుక్రవారం దెందులూరులోని శ్రీమతి గారపాటి హైమావతి దేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె పరిశీలించారు. శిక్షణ తరగతులపై విద్యార్థులతో పాటు హెచ్ఎం జి. మల్లికార్జునరావులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు లోవరాజు, భాస్కర్‌ప్రసాద్, జయశ్రీ, గ్రంథపాలకులు గుల్లపూడి వెంకటేశ్వరావు తదితరులు ఉన్నారు

'కొత్తపల్లి చంద్రమౌళిపై చర్యలు తీసుకోవాలి'

ఏలూరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : భీమడోలుకు చెందిన కొత్తపల్లి చంద్రమౌళి అనే వ్యక్తి ఆర్టీఐ యాక్ట్ ద్వారా అధికారులపై తప్పుడు ఫిర్యాదు చేస్తూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న అతడిపై చర్యలు తీసుకోవాలని దళిత నాయకులు కోరారు. శుక్రవారం జిల్లా పంచాయతీ కార్యాలయంలో, కలెక్టరేట్‌లో అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పైడిమాల యుగంధర్ తదితరులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమడోలు నెహ్రూనగర్ చెందిన చంద్రమౌళి దళిత కులాన్ని అడ్డుపెట్టుకుని అధికారులను భయభ్రాంతులకు గురి చేయడం, మహిళా ఉద్యోగులని చూడకుండా దుర్భాషలాడుతూ ఉంటాడన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు రవికుమార్, తుమ్మల శాంతభూషణం, దవులూరి మరియన్న, కూర్మ పౌల్‌సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు 200 పనిదినాలు కల్పించాలి

జంగారెడ్డిగూడెం,మే 9(ఆంధ్రజ్యోతి):ఉపాధి హామీ కూలీల పనిదినాలు రెండు వందలకు పెంచి, రోజువారీ కూలీ రూ.600కు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి జంపన వెంకట రమణరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పంగిడిగూడెం గ్రామంలో ఉపాధి హామీ కూలీలను సీపీఐ, బీకేఎంయూ ఆధ్వర్యంలో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. సీపీఐ, బీకేఎంయూ నాయకులు జంపన వెంకట రమణరాజు, గొలిమే బాలయేసు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని సంపూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జి.ఆశీర్వాదం, రామారావు, కుంచె పాప, కె.భీమార్జున, వెంకటలక్ష్మి, ప్రభాకరరావు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ మంగళగిరి కార్యాలయంలో శుక్రవారం జరిగిన వర్క్‌షాప్‌నకు వెళ్లిన జంగారెడ్డిగూడెం పట్టణ, మండల టీడీపీ నాయకులు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు

12వ పీఆర్సీ అమలు చేయాలి

ఏలూరు రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): పన్నెండో పీఆర్‌సీ అమలు చేసి పెండింగ్ డీఏలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి జిల్లా అధ్యక్షుడు తాళ్ళూరి రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేయబోతున్న తొమ్మిది రకాల పాఠశాలల వ్యవస్థ అసంబద్ధంగా ఉందని, ఈ వ్యవస్థను అమలు చేస్తే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వ్యవస్థ మొత్తం నిర్వీర్యం అవుతుందన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని ప్రాథమిక పాఠశాలలను ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు కొనసాగించాలని, ప్రాథమికోన్నత పాఠశాలలను ఒకటి నుంచి ఏడో తరగతి వరకు లేదా ఎనిమిదో తరగతుల వరకు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలలను ఆరు నుంచి పదో తరగతి లేదా ఆరు నుంచి పన్నెండో తరగతి వరకు కొనాసాగించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రెడ్డిదొర, జిల్లా కార్యదర్శి యూవీ నరసింహరాజు మాట్లాడారు. అనంతరం డీఆర్‌వోని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ధర్నాలో జిల్లా ఆడిట్ కమిటీ బాధ్యులు జగదీష్, ఎన్.కొండయ్య, ఏలూరు నగర అధ్యక్షుడు కె.ఆనంద్‌కుమార్, ఏలూరు రూరల్ ప్రధాన కార్యదర్శి తేళ్లూరి శ్రీనివాస్, బీపీ అబ్బులు, నగర ఉపాధ్యక్షుడు ఎం.సుబ్బారావు, కె.పోట్టియ్య తదితరులు పాల్గొన్నారు.

మలేరియా రాకుండా ప్రజలను చైతన్యపరచాలి : చిర్రి



బర్రింకలపాడులో దోమల మందు స్ప్రేయింగ్ చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

జీలుగుమిల్లి, మే 9 :(ఆంధ్రజ్యోతి): మలేరియా జ్వరాలు రాకుండా ప్రజలను చైతన్యపరచాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అధికారులకు సూచించారు. శుక్రవారం బర్రింకలపాడులో మలేరియా నివారణకు దోమల మందు స్ప్రేయింగ్ చేసే పనుల్ని ఆయన పరిశీలించారు. దోమల మందు స్ప్రేయింగ్ చేశారు. పారిశుధ్య చర్యలు చేపట్టేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి పెద్దిరాజు, పీహెచ్‌సీ సిబ్బంది వెంకట్, ప్రసాద్, బాలాజీ, రవీంద్ర ఉన్నారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ఏలూరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : శనివారపు పేటలో ఉన్న వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఈనెల పది నుంచి పద్నాలుగో తేదీ వరకు స్వామివారి 64వ వార్షిక వైశాఖ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పరిమి గంగాధర్‌రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10న స్వామి అమ్మవార్లను పెండ్లి కుమారుడు పెండ్లి కుమార్తెని చేయుట. 11న రాత్రి స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవం, 12న విశేష పూజలు, 14న పవళింపు సేవ, 18న ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు వీరమనేని వెంకట పద్మనాభరావు, పట్టపు ప్రభాకర్‌రావు తెలిపారు.

విజయరాయిలో వెంకన్న తిరుకల్యాణోత్సవం

పెదవేగి, మే 9(ఆంధ్రజ్యోతి): విజయరాయిలో వున్న వేంకటేశ్వర వేణుగోపాలస్వామి తిరు కల్యాణోత్సవం గురువారం రాత్రి వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్తలు పీబీ.రంగరాజన్-రమణి, పీబీ. శ్రీనివాసకృష్ణ-చీణ, పీబీ అయ్యంగార్-లక్ష్మి, ఎం.శ్రీరామ్-మణి దంపతులు, పీబీ వేణుగోపాలాచార్యులు, కేవీ రఘు తదితరుల నిర్వహణలో స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. అర్చకుడు పీబీ రంగనాథన్ స్వామి కల్యాణ వేడుకను నిర్వహించారు. భక్తులు తిరు కల్యాణోత్సవాన్ని తిలకించి ప్రసాదాలు స్వీకరించారు.

కోటలో నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

కామవరపుకోట, మే 9(ఆంధ్రజ్యోతి):స్థానిక సంత మార్కెట్ సమీపంలో గల యూపీ స్కూలు వద్ద శనివారం చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పుట్టిన రోజు సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అన్ని వ్యాధులకు శిబిరంలో ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారన్నారు.

నోవా కళాశాలపై కేసు నమోదు చేయాలి

జంగారెడ్డిగూడెం, మే 9(ఆంధ్రజ్యోతి): నోవా కళాశాల యాజమాన్యం పూర్వ విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న కారణంగా యాజమాన్యంపై సుమోటోగా కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ కమిటీలు సంయుక్తంగా డిమాండ్ చేశాయి. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో ఆ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ అధ్యక్షతన జరిగింది. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్య కిరణ్ మాట్లాడుతూ డీఎస్సీ కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఇంకా వారం గడువు ఉందని ఈ సమయంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. తక్షణమే ఈ కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పి.యశ్వంత్,పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

సాయి మందిర్‌లో చలివేంద్రం ఏర్పాటు

ఏలూరుకార్పొరేషన్, మే 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదివారపుపేటలోని షిరిడీ సాయి ప్రేమమందిర్ వద్ద ఆలయ ధర్మకర్త ఇనుకపల్లి తాతారావు ఆధ్వర్యంలో సాయి భక్తులు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవి తాపం తగ్గే వరకు నిరంతరం ఆలయం వద్ద భక్తులకు మజ్జిగను అందజేస్తామని తాతారావు తెలిపారు.

విద్యార్థుల ఉన్నతికి 'ఇంపాక్ట్ క్లబ్' కృషి

ఏలూరు రూరల్, మే9(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో చదివే విద్యార్థులు మంచి మార్కులతో పాటు ఉన్నతంగా ఎదిగేందుకు ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ కృషి చేస్తుందని ఆ క్లబ్ ట్రైనర్ ఎం.లక్ష్మీనరసింహ తెలిపారు. ఇటీవల క్లబ్ వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా ఇంపాక్ట్ క్లబ్ అందించిన శిక్షణలో ఏలూరుకు చెందిన లక్ష్మీనరసింహం ప్రతిభ కనబరిచి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు గంప నాగేశ్వరరావు చేతుల మీదుగా లక్ష్మీ నరసింహం శుక్రవారం అవార్డు అందుకున్నారు.

ఫీల్డ్ టెక్నీషియన్, ఎయిర్ కండీషన్

కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఏలూరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నిరుద్యోగ యువతకు షార్ట్ టర్మ్ కోర్స్ కింద ఫీల్డ్ టెక్నీషియన్ - ఎయిర్ కండిషన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక డీఎల్‌టీసీ సహాయ సంచాలకుడు ఎస్.ఉగాది రవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాశ్ యోజన కింద ఈ కోర్సుల్లో మూడు నెలలుపాటు ఉచితంగా శిక్షణ అందిస్తారన్నారు. టెన్త్ ఆపైన ఉత్తీర్ణులై, 35 ఏళ్ల వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 15వ తేదీ లోగా ఏలూరు కలెక్టరేట్ సమీపంలో డీఎల్‌టీసీ కార్యాలయానికి పంపాలన్నారు. సమాచారానికి 94934 82414 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈవోపీఆర్‌డీగా రాజారావు బాధ్యతల స్వీకరణ

పోలవరం మే 9(ఆంధ్రజ్యోతి) : పోలవరం మండల ఈవోపీఆర్‌డీగా పట్టిసీమ పంచాయతీ కార్యదర్శి యు.రాజారావును ఇన్‌చార్జిగా నియమించినట్టు ఎంపీడీవో చెరుకూరి శ్రీనివాస్‌బాబు శుక్రవారం తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇప్పటి వరకు పోలవరం మండల ఈవోపీఆర్‌డీగా బాధ్యతలు నిర్వర్తించిన ఈ. శ్రీనివాస్ బుట్టాయగూడెం బదిలీపై వెళ్లారని, ఆయన ఈనెల 8 నుంచి బాధ్యతల నుంచి రిలీవ్ కాగా ఆ స్థానంలో రాజారావును ఇన్‌చార్జిగా ఈవోపీఆర్‌డీగా నియమించినట్టు తెలిపారు. ఆయనకు పలువురు అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎవరీ చిన్నారి ?

ద్వారకాతిరుమలలో తప్పిపోయి తిరుగుతున్న గోపాల్ !



పోలీసుల సంరక్షణలో ఉన్న తప్పిపోయిన బాలుడు

ద్వారకాతిరుమల, మే 9 (ఆంధ్రజ్యోతి): ఓ బాలుడు తప్పిపోయి ద్వారకా తిరుమలలో ఒంటరిగా తిరుగుతున్నాడు. గమనించిన స్థానికులు శుక్రవారం పోలీసులకు సమాచారం అందించారు. ఐదేళ్ల ఈ బాలుడు స్థానిక యూనియన్ బ్యాంక్ సమీపంలో ఒక్కడే తిరుగుతుండాన్ని చూసి స్థానికులు ఆపి విచారించారు. తనపేరు గోపాల్ అని తండ్రి పేరు నాయక్ అని చెబుతున్నాడు మినహా ఇంకేం వివరాలు చెప్పకపోవడంతో పోలీసుకు చెప్పారు. పోలీసులు బాలుడిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. ప్రస్తుతం ఈ బాలుడు స్టేషన్‌లో ఉన్నాడని ఆచూకీ తెలిసిన వారు 94407 96653కు సమాచారాన్ని అందించాలని పోలీసులు తెలిపారు.

మామిడి రైతులను ఆదుకుంటా

నూజివీడు, మే 9 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వంతో మాట్లాడి అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి సారథి తెలిపారు. ఈ నియోజకవర్గపరిధిలో అటవీభూములు సాగుచేసే రైతులు అధికంగా ఉన్నారని, వారికి సబ్సిడీపై అందించే విద్యుత్‌బోర్లు విషయంలో అధికారులు ఎలాంటి ఇబ్బంది పెట్టవద్దని మంత్రి సూచించారు. ఔత్సాహిక రైతులకు పశువుల పెంపకందారులకు, నిరుద్యోగులకు ప్రోత్సాహంగా ప్రభుత్వం అనేక రుణాలు అందచేస్తోందని తెలిపారు. రైతులకు రుణాలపై అవగాహన, వాటి లబ్ధిపై, వాటిని పొందే విధానంపై బ్యాంకర్స్, అగ్రికల్చర్, ఇతర ప్రభుత్వ అధికారులు కలిసి ప్రతినెల ఒక సమావేశం ఏర్పాటుచేసి రైతులకు వివరించాలని కోరారు.

నామినేటెడ్ నిరీక్షణ

(5వ పేజీ తరువాయి)

పదవి ఖాయమనే ధీమాతో ఉండేవారు. డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ పదవుల్లో ఏదో ఒకటి తనకి దక్కకపోతుందా అని ఆశించారు. నామిటెడ్ పోస్టుల్లో ఏదో ఛాన్సు లభిస్తుందని కొత్తూరి బాపిరాజు, ఇందుకూరి రామకృష్ణంరాజు, మెరగాని నారాయణమ్మ, నెప్పూరా జనసేనకు చెందిన నేతలంతా ఉన్నారు. ఏలూరులో సీనియర్ నేత ఎంఆర్‌డీ బలరాం, మధ్యాహ్నపు ఈశ్వరి, కంప్యూటర్ ప్రసాద్, కడియాల విజయలక్ష్మి, కొల్లేపల్లి రాజు వంటి ముఖ్య నేతలపై నామినేటెడ్ ప్రచారం సాగుతోంది. చింతలపూడి నియోజకవర్గానికి చెందిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యాంచంద్రశేషు బీసీ వర్గాల నుంచి ఏదో ఒక అవకాశాన్ని కోరుకుంటున్నారు. పార్టీ ముఖ్యులతోపాటు సీఎం చంద్రబాబు, యువనేత లోకేశ్ వంటి వారిని పలుమార్లు కలిసి తనకు అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. నూజివీడు, కైకలూరులో పార్టీలోని సీనియర్లు అంతా పలుమార్లు పార్టీలో రాష్ట్రస్థాయి నేతలకు తమగోడు వెళ్లబోస్తున్నారు. నరసాపురంలో డాక్టర్ రాజ్యలక్ష్మి, కొల్లు పెద్దిరాజు, కొప్పాడ రవి, ఆచంటలో గొడవర్తి శ్రీరాములు, తణుకులో దొమ్మేటి వెంకటసుధాకర్ వంటి వారంతా నామినేటెడ్ లిస్టులో తమకు గౌరవం దక్కుతుందన్న అంచనాల్లో వున్నారు. తాడేపల్లిగూడెంలో పరిమి రవికుమార్, వాడపల్లి వెంకటసుబ్బరాజు, దాసరి అప్పన్న, పాతూరి రాంప్రసాద్‌చౌదరి వంటి వారు పోలవరంలో మేఘాలాదేవితోపాటు ఒక అర డజను నేతలు ఆశలు పెంచుకున్నారు. జనసేన, బీజేపీ పక్షాన సైతం కొందరి పేర్లు తెరముందుకు వచ్చినా జాబితాలో చోటు ఎంత వరకూ దక్కుతుందనేది అనుమానంగానే ఉంది.



సుభద్ర బలరామ సహిత జగన్నాథస్వామి

నేటి నుంచి జగన్నాథస్వామి బ్రహ్మోత్సవాలు

ముదినేపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలో సుభద్ర బలరామ సహిత జగన్నాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 14వ తేదీ వరకు జరుగుతాయి. అతిపురాతనమైన దేవస్థానాల్లో ఒక్కటైన జగన్నాథస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలకు అత్యంత ప్రాధాన్యత ఉన్నందున జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొనటం ఆనవాయితీ. ఇందుకు దేవస్థానం వద్ద విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 11న జరుగనున్న జగన్నాథస్వామి తన్మూర్తి ప్రత్యామ్నాయ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. దేవస్థానం ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉత్సవాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నేటి నుంచి సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు



కోరుకొల్లులో సోమేశ్వరస్వామి ఆలయం

కలిదిండి, మే 9 (ఆంధ్రజ్యోతి): కోరుకొల్లులో పార్వతీ సమేత సోమేశ్వరస్వామి కళ్యాణోత్సవాలు ఈ నెల 10వ తేదీ నుంచి 12 వరకు నిర్వహించనున్నామని ఆలయ ఈవో శేఖర్ తెలిపారు. 10న స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా అలంకరణ 11న స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

రేపటి నుంచి అల్లూరులో ఉత్సవాలు



అల్లూరులోని సోమేశ్వరస్వామి

ముదినేపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామంలో పార్వతీ సమేత సోమేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 11 నుంచి స్వామివార్ల వార్షిక కల్యాణోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 13వరకు జరుగుతాయి. ఈ నెల 11న స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా చేయుట, 12న రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం స్వామివారి కల్యాణం, 13న రథోత్సవం, అన్నసమారాధన నిర్వహిస్తామని నిర్వాహకులు శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

రేపటి నుంచి అమ్మవార్ల తిరునాళ్ల



ఆరుగొలనుపేటలో శ్రీలక్ష్మమ్మ అంకమ్మ అమ్మవార్ల ఆలయం

చాట్రాయి, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరుగొలనుపేటలో శ్రీలక్ష్మమ్మ అంకమ్మ అమ్మవార్లు తిరునాళ్ల 11వ తేదీ నుంచి 13వరకు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 105 సంవత్సరాల క్రితం వెలసిన అమ్మవార్ల తిరునాళ్లకు చుట్టు పక్కల మండలాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. ప్రతి ఏటా వైశాఖ మాసంలో పౌర్ణమి రోజున తిరునాళ్ల ప్రారంభం అవుతాయి. ఈ గ్రామానికి చెందిన ఆడపడుచులు ఎంత దూర ప్రాంతంలో ఉన్నా తిరునాళ్లకు వచ్చి అమ్మవార్లకు పసుపు కుంకుమ గాజులు సమర్పించటం ఆనవాయితీ. మూడు రోజులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహిస్తారు. 13వ తేదీన భారీ అన్నసమారాధన జరగనుంది.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



కైకలూరు, మే 9(ఆంధ్రజ్యోతి): శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలను ఈ నెల 10వ తేదీ నుంచి 12 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వీఎన్‌కె శేఖర్ తెలిపారు. 10వ తేదీన స్వామి, అమ్మవారిని పెండ్లికుమారుడు, కుమార్తెగా చేయడం, సుదర్శన హోమం, మాడవీధుల్లో గజవాహనంపై స్వామివారి ఊరేగింపు వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. 11న స్వామివారిని మాడవీధుల్లో శేషవాహనంపై ఊరేగింపు, రాత్రికి స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. 12వ తేదీ గ్రామ పురవీధుల్లో గరుడవాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు. ప్రతి రోజూ శ్రీమన్నారాయణగోష్టి మహిళలచే విష్ణుసహస్రనామ పారాయణం నిర్వహిస్తారు. రాత్రి సాంస్కృతి కార్యక్రమాల్లో భాగంగా 10, 11వ తేదీల్లో రాత్రి కూచిపూడి, నృత్య ప్రదర్శనలు, 12వ తేదీన కోలాట ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

వచ్చే నెలాఖరుకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి: మంత్రి సారథి



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి పార్థసారథి

నూజివీడు, మే 9 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గంలో పేదలకు నిర్మిస్తున్న గృహ నిర్మాణ పనులు జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. శుక్రవారం నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై హౌసింగ్, డ్వామా, ఆర్‌డబ్ల్యూఎస్, డీఆర్‌డీఏ, పంచాయతీరాజ్, ఏపీఈపీడీసీఎల్ మెప్మా, రెవెన్యూ శాఖల అధికారులతో ఆయన సమీక్షాసమావేశం జరిపారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కొత్త నిబంధనల ప్రకారం 3సెంట్ల భూమిని ఇళ్ళనిర్మాణం కోసం మంజూరు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఇసుక, సబ్సిడీపై సిమెంట్ వంటి నిర్మాణ సామగ్రి గురించి లబ్ధిదారులకు తెలియచేసి త్వరితగతిన వాటిని పూర్తి చేయించాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం మేరకు గృహనిర్మాణాలు పూర్తి చేయనిపక్షంలో చర్యలు తీసుకోవడానికి వెనుకాడబో మన్నారు. గృహనిర్మాణంపై ఉన్న సమస్యలను పలువురు మంత్రి దృష్టికి తీసుకురాగా వాటికి పరిష్కారం అయ్యేలా మార్గాలు చూడమని అధికారులకు సూచించారు. అర్హత ఉన్న ప్రతి పేదవాడికి ఇల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్య మన్నారు. నియోజకవర్గంలో ఎన్ని ఇళ్లు నిర్మించారు? ఇంకా ఎన్ని నిర్మించాల్సి ఉంది? సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరారు. ఎస్సీ, బీసీలకు అదనంగా రూ.50వేలు ప్రభుత్వం అందిస్తోం దన్నారు. డ్వాక్రా మహిళలకు అదనంగా రూ.30వేలు ప్రభు త్వం అందిస్తోందన్నారు. నూజివీడు సబ్‌కలెక్టర్ డి.స్మరణ్ రాజ్ పాల్గొన్నారు.

ఇండియన్ ఆర్మీకి మద్దతుగా ర్యాలీ





ముదినేపల్లిలో ర్యాలీ.. నూజివీడులో సైనికులకు మద్దతుగా పూజలు చేస్తున్న మహిళలు

ముదినేపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి) : పాకిస్థాన్ సరిహద్దులో ఇండియన్ ఆర్మీ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనందుకు హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం సాయంత్రం ముదినేపల్లిలో ఎన్డీఏ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదంపై భారత దేశం నిర్వహిస్తున్న దాడులకు మద్దతు ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఏపీ టూరిజయం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, టీడీపీ నాయకులు చలసాని జగన్మోహనరావు, పోసిన పాండురంగారావు, రవికుమార్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు, మండల పార్టీ అధ్యక్షురాలు సత్యవేలు నాగలక్ష్మి, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి వేల్పూరి నానాజీ నాయకత్వంలో ర్యాలీ నిర్వహించారు.

భారత సైనికులకు సెల్యూట్

నూజివీడు, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ పాల్గొన్న భారత సైన్యానికి సెల్యూట్ చేస్తున్నామని రాష్ట్ర మంత్రి కె.పార్థసారథి అన్నారు. శుక్రవారం నూజివీడులో సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ భారతజవాన్లు చేసిన పోరాటం చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలుస్తుందన్నారు. భారతదేశం ఉగ్రవాదం పై ఎంత కఠినంగా వ్యవహరిస్తుందో మరోసారి స్పష్టం చేసిందన్నారు. మన సైనికుల ధైర్యసాహసాలు యువతకు దేశభక్తిని మరింత పెంచాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకుంటున్న చర్యల వల్ల అభివృద్ధి చెందిన దేశాలకంటే తమ ఆర్థిక వ్యవస్థ ఎంతో మెరుగ్గా ఉందన్నారు.

సైనికుల విజయాన్ని కాంక్షిస్తూ పూజలు

నూజివీడు, మే 9 (ఆంధ్రజ్యోతి):పాక్ ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు ఆపరేషన్ సిందూర్ పేరుతో భారతదేశ త్రివిధ దళాలు చేస్తున్న సమరంలో సైనిక బలాల విజయాన్ని, వారి ప్రాణాల రక్షణ కాంక్షిస్తూ నూజివీడు దేవదత్తపీఠానికి చెందిన పలువురు మహిళలు గురువారం నుంచి సామూహికంగా నివాసగృహాల్లో, ఆలయంలోనూ, భగవద్గీతలోని 700శ్లోకాలను పఠిస్తూ పూజలు నిర్వహిస్తున్నారు. యుద్ధం ముగిసే వరకు నిత్యం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వీరు తెలిపారు.

ఇంటర్వ్యూ..

100 రోజుల పని దినాలు కల్పిస్తున్నాం

నవీన్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో



- ఉపాధి కూలీలకు ఎన్ని రోజులు పని దినాలు కల్పిస్తున్నారు?

జవాబు : 100 రోజులు పని దినాలు కల్పిస్తున్నాం. రోజువారి కూలీ రూ.307లుగా వేతనం ఇస్తున్నాం.

- ఎన్ని రోజులకోసారి వేతనాలు ఇస్తున్నారు?

జవాబు : 15 రోజులకు వేతనాలను కూలీల బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తున్నారు. వేతనాల చెల్లింపుల్లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- పని చేసే ప్రదేశంలో ఎటువంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

జవాబు : టెంట్లు వేసి తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నాం. ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌ను అందుబాటులో ఉంచుతున్నాం.

- మండలంలో ఎంత మంది ఉపాధి కూలీలు ఉన్నారు.?

జవాబు : 2460 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. వీరందరికి ఉపాధి పనులు కల్పిస్తున్నాం. కొత్తవారికి కూడ ఉపాధి పనులు కల్పించటానికి చర్యలు తీసుకుంటున్నాం.

- కలిదిండి, ఆంధ్రజ్యోతి



కొండపై పాకలు వేసి పందుల పెంపకం

శోభనాచలుడు కొండపై పందులు

భక్తుల ఆవేదన

ఆగిరిపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లిలోని శ్రీ లక్ష్మీనరసింహ ఆలయ కొండపై పందుల పెంపకం చేస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వామివారి కొండపైన పాకలు వేసి పందుల పెంపకం చేస్తున్నారని భక్తులు తెలిపారు. గిరిప్రదక్షిణ చేసేటప్పుడు దుర్వాసన వాతావరణంలో స్వామి వారిని దర్శించుకుంటున్నామని భక్తులు తెలిపారు. గ్రామంలో కూడా పందులు యథేచ్ఛగా తిరుగుతున్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి పందుల పెంపకం తొలగించాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, మే 9(ఆంధ్రజ్యోతి): కైకలూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సాధారణ మరమ్మతుల కోసం శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీబీ శ్రీనివాస్ తెలిపారు. కైకలూరుటౌన్‌లో వినియోగదారులంతా గమనించాలని కోరారు.

బాల్య వివాహాలు చేస్తే చర్యలు

ముదినేపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెయ్యేరు పంచాయతీ ఏరియాలోని కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో భేటీ బచావో - భేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రూప్సీ మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేసేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నందున తల్లిదండ్రులు చట్టానికి లోబడి వ్యవహరించాలని తెలిపారు. బాల్య వివాహాలను నిర్వహిస్తే తల్లిదండ్రులతోపాటు వివాహ నిర్వహణ కర్తలందరూ కూడా దోషులు గానే పరిగణింపబడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీల కార్యకర్తలు బండి పద్మ, నిర్మల కుమారి, విజయలక్ష్మి, నాగలక్ష్మి, కుమారి తదితరులు పాల్గొన్నారు.





ముదినేపల్లి మండలం పెయ్యేరుకాలనీలో ఐసీడీఎస్ సిబ్బంది అవగాహన.. చాట్రాయిలో బాలికలకు అవగాహన

బాల్య వివాహాల నిరోధంపై అవగాహన

చాట్రాయి, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాట్రాయి మెయిన్, పోలవరం అంగన్వాడీ కేంద్రాలలో శుక్రవారం బాల్య వివాహాల వలన అనర్థాలపై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. పౌష్టికాహారం ఆవశ్యకత, పరిశుభ్రత, గుడ్ బ్యాడ్ టచ్, రుతుక్రమం, లైంగిక విద్య మొదలైన అంశాలపై బాలికలకు వివరించారు. మహిళా పోలీసులు చంద్రకళ, సమత, వెల్ఫేర్ అసిస్టెంట్ దివ్య, ఏఎన్ఎంలు సుజాత, శ్రీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ కమిటీల ఎంపిక



ఈదులగూడెం అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



తోటపల్లి అధ్యక్షుడిగా ప్రసాద్





కొత్తగూడెం అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం, పర్వతాపురం- నాగ మల్లేశ్వరి

ఆగిరిపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండలం, ఈదులగూడెం గ్రామంలో శుక్రవారం టీడీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అధ్యక్షుడు ఎన్నికలు నిర్వహించారు. ఈదులగూడెం గ్రామ తెలుగుదేశంపార్టీ కమిటీ అధ్యక్షుడుగా దండిబోయిన శ్రీనివాసరావు ఎన్నిక అయ్యారు. ఉపాధ్యక్షులు పెనుముచ్చు ఆన ంద్ బాబు, ప్రధాన కార్యదర్శి ఆరేపల్లి బసవయ్య, కార్యనిర్వాహక కార్యదర్శులు కుప్పల వెంకటాద్రి, గుంటూరు బసవయ్య, అచ్చి నాగేంద్రబాబు, సొంగ సురేష్, ఈడే శోభనబాబు, కంబంపాటి శ్రీశైలం, కోశాధికారి కోటపాటి నాగరాజు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కమిటీకి పార్టీ పరిశీలకులుగా నూజివీడు టౌన్ పార్టీ ప్రెసిడెంట్ మల్లిశెట్టి జగదీష్, మాజీ కౌన్సిలర్ కృష్ణ, చిట్నేని శివరామకృష్ణ, గ్రామ టీడీపీ నాయకులు విచ్చేశారు. తోటపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్‌గా బెజవాడ శివరామ్‌ప్రసాద్ ఎన్నిక అయ్యారు. ఈ కార్యక్రమంలో ఆరేపల్లి శ్రీనివాసరావు, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలో కొత్తగూడెం గ్రామ టీడీపీ అధ్యక్షుడుగా మలగలపల్లి సుబ్రహ్మణ్యం, పర్వతాపురం గ్రామ టీడీపీ అధ్యక్షురాలుగా బొర్రా నాగ మల్లేశ్వరి ఏకగ్రీంగా ఎన్నికయ్యారు. గురువారం రాత్రి పార్టీ పరిశీలకుడు గద్దె రఘుబాబు ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. అనంతరం మిగతా కార్యవర్గం ఎన్నిక జరిగింది.

చిగురుకోటలో చోరీ

ముదినేపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి) : చిగురుకోట గ్రామంలో గుబిలి సుబ్బారావు ఇంటి తాళాలు పగులగొట్టి రూ. 3.20 లక్షల విలువైన బంగారపు ఆభరణాలతో పాటు, వెండి ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను దుండగులు ఎత్తుకు పోయిన సంఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం ఈనెల 6న ఆ గ్రామానికి చెందిన సుబ్బారావు తన భార్యను వైద్య పరీక్షల నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. తిరిగి శుక్రవారం సాయంత్రం భార్యతో కలిసి ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఎస్ఐ వీరభద్రరావు తన సిబ్బందితో వెళ్ళి చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ పనిముట్ల పంపిణీ

నూజివీడు, మే 9 (ఆంధ్రజ్యోతి): యనమదల గ్రామంలో గృహనిర్మాణశాఖ మంత్రి కె.పార్థసారథి శుక్రవారం వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం 50శాతం సబ్సిడీపై పశువుల దాణా, వ్యవసాయ పనిముట్లు, పచ్చిరొట్ట విత్తనాలు, ట్రాక్టర్లు, రోటోవేటర్లు, పవర్ స్ప్రేయర్లు వంటివి అందిస్తోందని తెలిపారు. ఏలూరుజిల్లాకు 50శాతం సబ్సిడీపై 1500 మంది రైతులకు సుమారు రూ.4కోట్లతో వ్యవసాయ ఆధునిక యంత్రాలు అందించామన్నారు. జిల్లాకు పచ్చిరొట్ట విత్తనాలు, సుమారు రూ.7కోట్లు కేటాయించామన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన సేవలందించండి

ఏలూరు క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధా న కార్యదర్శి ఎంటి కృష్ణబాబు వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ వైద్యకళాశాల భవనాల నిర్మాణ పను లను పరిశీలించేందుకు శుక్రవారం ఏలూరు వచ్చారు. ఎమ్మెల్యే బడేటి చంటి ఆయనను కలిసి ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత, వైద్య పరికరాలు కొరత వివ రించారు. వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టుల భర్తీకి కలెక్టర్ సూచనల మేరకు నోటిఫికేషన్ జారీ చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్య కళాశాల ప్రిన్సి పాల్‌ను కృష్ణబాబు ఆదేశించారు. అవసరమైన వైద్య పరికరాల కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. ఆప రేషన్ థియేటర్‌లో శస్త్ర చికిత్సకు అత్యవసర పరికరాలు ఆసుపత్రి అభివృద్ధి నిధుల నుంచి కలెక్టర్ అనుమతితో కొనుగోలు చేయాలన్నారు. ఇతర ఆసుపత్రులలో పని చేసే రేడియోలజిస్టులను గంటల ప్రాతిపదికన తాత్కాలికంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా అధికంగా శస్త్ర చికిత్సలు జరిగేలా వైద్యులు చూడాలన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని, సీసీ కెమెరాల ద్వారా వైద్య సిబ్బం ది పనితీరును పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

సౌకర్యవంతమైన వసతి గృహాలు నిర్మించాలి

ప్రభుత్వ వైద్యకళాశాల విద్యార్థులకు సౌకర్యవంతమైన వసతి గృహాలు నిర్మించాలని కృష్ణబాబు అధికారులను ఆదేశించారు. సంక్షేమ వసతి గృహాల సముదాయం, ప్రభుత్వ వైద్య కళాశాల భవనా ల నిర్మాణ పనులను కలెక్టర్ కె.వెట్రిసెల్వి, వైద్య విద్య సంచాలకుడు నరసింహం, ఏడీ వెంకటేశ్, ఎమ్మెల్యే బడేటి చంటి, అధికారులతో కలిసి కృష్ణబాబు పరిశీలించారు.

ఆక్రమణల తొలగింపునకు సహకరించాలి

కైకలూరు, మే 9(ఆంధ్రజ్యోతి): కైకలూరు పట్టణంలో ఆక్రమణల తొలగింపులో ప్రజలు సహకరించాలని ఎండీవో ఆర్ ఫణీంద్ర కోరారు. శుక్రవారం కైకలూరులో జాతీయ రహదారి వెంబడి ఆక్రమణ తొలగింపును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండీవో మాట్లాడుతూ రహదారుల వెంబడి ఆక్రమణలు తొలగిస్తే రానున్న వర్షాకాలంలో ఎక్కడా ముంపు సమస్య ఉండదని, డ్రెయిన్లలో నీరు ఎప్పటికప్పుడు పారుదల అవుతుంటే దోమలు వ్యాపించకుండా ఉంటాయన్నారు. అన్ని గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లు నిర్వహిస్తామన్నారు. వేసవిలో డ్రెయిన్ల ప్రక్షాళనతో ముంపు సమస్య తొలుగుతుందన్నారు. అలాగే వెలంపేట, రైల్వే బ్రిడ్జ్ నుంచి పుల్లవా డ్రెయిన్‌లోకి వెళ్లే బోదెలను ఆధునీకరిస్తామని తెలిపారు. పారిశుధ్య కార్మికులను ప్రత్యేకంగా నియమించి డ్రెయిన్లలో సిల్ట్‌ను తొలగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కైకలూరు పంచాయతీ కార్యదర్శి ఆనందభూషణం, తదితరులు పాల్గొన్నారు.



కైకలూరులో ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఆక్రమణలను పరిశీలిస్తున్న ఎండీవో ఫణీంద్ర, కార్యదర్శి ఆనందభూషణం

ప్రభుత్వాసుపత్రిలో మాక్‌డ్రిల్



క్షతగాత్రులకు వైద్య సేవలందించే విధంగా మాక్‌డ్రిల్ చేస్తున్న వైద్యాధికారులు

కైకలూరు, మే 9(ఆంధ్రజ్యోతి): యుద్ధ వాతావరణం నేపథ్యంలో క్షతగాత్రులకు తక్షణ వైద్యసాయం అందించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కైకలూరు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో యుద్ధంలో గాయపడితే క్షతగాత్రులకు వైద్యసాయం అందించే విధానంపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తీసుకువచ్చిన వెంటనే ఎంతో అప్రమత్తతో వైద్య సిబ్బంది గాయపడిన వారిని తగినట్లుగా వైద్యసాయం ఏవిధంగా అందించాలనేది కళ్ళకు కట్టినట్లుగా మాక్‌డ్రిల్ ద్వారా వివరించారు. వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475